# మన తొలివెలుగు

RNI: TGBIL/26/A2289

తెలుగు దినపత్రిక

www.manatolivelugu.in

CEO & Chief Editor : Vanga Nagaraj Reddy (Raju)

హైదరాబాద్ | మంగళవారం 21 జూలై 2026 | సంపుటి : 1 | సంచిక : 49 | పేజీలు : 8 | వెల : 2/-


## కుప్పకూలిన బ్లూచిప్ షేర్లు.. తీవ్ర అమ్మకాల ఒత్తిడితో 443 పాయింట్లు పతనమైన సెన్సెక్స్



**ముంబై, జూలై 20:** దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం నష్టాల్లో ముగిశాయి. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 442.93 పాయింట్లు లేదా 0.57 శాతం కోల్పోయి 77,708.52 వద్ద స్థిరపడింది. ఒకానొక దశలో 783.16 పాయింట్లు పడిపోవడం గమనార్హం. కాగా, భారీ సంస్థల షేర్లను మదుపర్లు పెద్ద ఎత్తున అమ్మేశారు. ఈ క్రమంలోనే యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌ల షేర్ విలువలు అత్యధికంగా 5.48 శాతం, 5.12 శాతం చొప్పున దిగజారాయి. ఇటీవలి త్రైమాసిక ఆర్థిక ఫలితాలు నిరుత్సాహకరంగా ఉండటమే కారణమని మార్కెట్ విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ సైతం 95.80 పాయింట్లు లేదా 0.39 శాతం క్షీణించి 24,238.50 వద్ద నిలిచింది.

# ఎల్ నినోను ఎదుర్కొంటాం




- రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటాం
- ఎల్ నినో ప్రభావం వల్ల రాబోయే రోజుల్లో ప్రజలకు ఎలాంటి తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలి
- ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోంది
- ఎలాంటి ప్రకృతి విపత్తులనైనా సమర్థవంతంగా ఎదుర్కొని ప్రజలను ఆదుకుంటాం
- మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డి



## అంతరిక్ష రంగంలో యువత అద్భుతాలు

- వర్షాలు బాగుండాలి
- వర్షాకాల సమావేశాలూ బాగుండాలి
- రెండూ బాగుంటేనే దేశం సుభిక్షంగా ఉంటుంది
- పార్లమెంట్ వర్షాకాల సమావేశాల ప్రారంభంలో మోదీ పిలుపు
- “దేశ పురోగతిలో యువత పాత్ర అత్యంత కీలకం
- వారి సామర్థ్యాలు, ఆకాంక్షలు అంతరిక్షమంత విశాలమైనవి.
- 56 ఏళ్ల యువకుని గురించి మాట్లాడట్లేదు
- రాహుల్‌కు మోదీ చురక

# తెలంగాణలో భూసేకరణకు ప్రత్యేక చట్టం

- వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో బిల్లు!
- రాష్ట్రవ్యాప్తంగా ల్యాండ్ పూలింగ్ చట్టానికి ప్రభుత్వం కసరత్తు
- భూమి కోల్పోయే రైతులకు అభివృద్ధి చేసిన స్థలాలు
- ముసాయిదా బిల్లుకు తుది రూపు



హైదరాబాద్

తెలంగాణలో భారీ మౌలిక వసతుల ప్రాజెక్టులకు భూసేకరణలో ఎదురవుతున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ల్యాండ్ పూలింగ్ విధానాన్ని తీసుకొచ్చేందుకు అధికార యంత్రాంగం వేగంగా కసరత్తు ప్రారంభించింది. తెలంగాణ కాంప్రహెన్సివ్ ఏరియా డెవలప్‌మెంట్ ప్లానింగ్ బిల్లు-2026 ప్రాథమిక ముసాయిదా సిద్ధమైనట్లు విశ్వసనీయ సమాచారం. ఈ బిల్లులో ఏమేం అంశాలు ఉండాలో సీఎస్ సంజయ్‌జాజు పురపాలక, రోడ్లు-భవనాలు, ఇరిగేషన్, రవాణా తదితర శాఖలు, హెచ్ఎండీఏ ఉన్నతాధికారులతో గురు, శుక్రవారాల్లో సెక్రెటరియట్‌లో చర్చలు చేశారు. ఈ ముసాయిదా బిల్లుకు తుది రూపు ఇచ్చేందుకు అధికారుల కసరత్తు - మిగతా3లో



## తొలి రోజే దుమారం

- నీట్, అయోధ్యలో విరాళాల చోరీ, విద్యార్థుల నిరసనలపై పార్లమెంట్‌లో ప్రతిపక్షాల ఆందోళనలు
- పలుమార్లు వాయిదాపడిన ఉభయ సభలు
- ‘ఇండియా’కూటమి నేతల ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో ఉభయసభలు హోరెత్తిపోయాయి
- తామిచ్చిన వాయిదా తీర్మానాలపై చర్చ కు విపక్షాలు పట్టుబట్టాయి

# క్యూఆర్ కోడ్‌తో స్మార్ట్ రేషన్

- 3 నెల బియ్యం ఒకేసారి పంపిణీ
- వారం రోజుల్లో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా కార్డుల పంపిణీ కార్యక్రమం
- క్యూఆర్ కోడ్‌తో పటిష్ఠ భద్రతా ఫీచర్లతో కొత్త కార్డుల రూపకల్పన
- ఆగస్టు నుంచి మూడు నెలల రేషన్ బియ్యం ఒకేసారి పంపిణీ
- రేషన్ సరుకులకు జులై 31 లోగా ఈ-కేవైసీ పూర్తి చేసుకోవడం తప్పనిసరి




హైదరాబాద్

తెలంగాణలో అర్హులైన పేదలకు కొత్త రేషన్ కార్డులు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ప్రస్తుతం వినియోగిస్తున్న కాగితపు కార్డుల స్థానంలో అత్యాధునిక టెక్నాలజీతో కూడిన ప్లాస్టిక్ స్మార్ట్ కార్డులను పంపిణీ చేయనుంది. వారం రోజుల్లోనే ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి ప్రారంభించేందుకు పౌరసరఫరాల శాఖ ముమ్మర ఏర్పాట్లు చేస్తోంది. హైదరాబాద్‌లో జరిగే ప్రధాన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పీవీసీ స్మార్ట్ కార్డుల రూపంలో రేషన్ కార్డులు ఇవ్వడం ఇదే తొలిసారి. ప్రస్తుతం - మిగతా3లో



## ఆపదలో అండగా... ఆర్టీసీ ఒకే కుటుంబం!

- కార్మికుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది
- రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- దివంగత డ్రైవర్ కోలా శంకర్ కుటుంబానికి రూ. 90.85 లక్షల ఆర్థిక సాయం అందించిన రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్.
- గత ప్రభుత్వాల కాలంలో ఆర్టీసీ కార్మిక సంఘాలను ఎత్తివేసి, నిరంకుశంగా వ్యవహరించారు

హైదరాబాద్

టీజీఎస్ ఆర్టీసీ కేవలం ఒక రవాణా సంస్థ మాత్రమే కాదని... వేలది మంది ఉద్యోగుల ఉమ్మడి కుటుంబమని రాష్ట రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. నర్సంపేట ఆర్టీసీ డిపోకు చెందిన దివంగత డ్రైవర్ కోలా శంకర్ కుటుంబానికి ఆర్టీసీ ఉద్యోగులు ‘చేయూత’ కార్యక్రమం ద్వారా - మిగతా3లో




## కోరలు చాస్తున్న పేదరికం

- పాకిస్థాన్‌ను చుట్టుముట్టిన ఆర్థిక సంక్షోభం..
- పాకిస్థాన్‌లో ప్రమాదకర స్థాయికి చేరిన పేదరికం
- గడిచిన ఆరేళ్లలో 21.8శాతం నుంచి 28.9శాతానికి పెరిగిన వైనం
- పట్టణాలతో పోలిస్తే గ్రామాల్లోనే ఎక్కువ ప్రభావం

# ‘అపార్’ తల్లిదండ్రుల ఇష్టం

- సమ్మతి పత్రంలో ఆప్ట్-అవుట్ ఆప్షన్ ఉండాల్సిందే
- ఆ మేరకు సవరణలు చేపట్టాలి
- సీబీఎస్ఈకి ఆదేశాలు జారీ చేస్తామన్న సుప్రీంకోర్టు
- దేశవ్యాప్తంగా ఒడిశా హైకోర్టు తీర్పు అమలుకు నిర్ణయం





## డిమాండ్లు నెరవేరే వరకు ఆందోళనలు కొనసాగుతాయి

- కేంద్రమంత్రి జేపీ నడ్డాతో కాక్రోచ్ జనతా పార్టీ నాయకుల భేటీ

# ‘అపార్’ తల్లిదండ్రుల ఇష్టం

**న్యూఢిల్లీ:** పాఠశాల విద్యార్థుల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ‘అపార్’(ఆటోమేటెడ్ పర్మనెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) ఐడీల నమోదుపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ పథకానికి సమ్మతిని నిరాకరించేందుకు, తప్పుకునేందుకు తల్లిదండ్రులకు అవకాశం కల్పించేలా సవరణలు చేపట్టాలంది. ఈ మేరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ)కి మార్గదర్శకాలు జారీ చేస్తామంది. నూతన విద్యా విధానం--2020 ప్రకారం కేంద్రం ప్రారంభించిన అపార్ పథకం కింద విద్యార్థుల కోసం ఒక ప్రత్యేకమైన, జీవితకాల 12--అంకెల ’స్టూడెంట్ ఐడీ’ రూపొందిస్తారు. ఇది విద్యార్థుల అన్ని విద్యాపరమైన రికార్డులకు ఒక డిజిటల్ పాస్‌పోర్ట్‌లా పనిచేస్తుంది. ఇందులో మార్కుల జాబితాలు, డిగ్రీ సరి?టఫికెట్లు, ఇతర విజయాల వివరాలన్నీ నిక్షిప్తమై ఉంటాయి.




**బలవంతం, రాజ్యాంగ విరుద్ధం...**

అపార్ ఐడీల నమోదు స్వచ్ఛందమేనని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, ఆచరణలో దీనిని ఆధార్‌తో అనుసంధానించి విద్యార్థులను బలవంతం చేస్తున్నారంటూ దాఖలైన పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది ఇందిరా జైసింగ్ వాదనలు వినిపిస్తూ.. బోర్డు పరీక్షలు రాసే విద్యార్థులకు అపార్ ఐడీని తప్పనిసరి చేస్తున్నారని తెలిపారు. పరోక్షంగా విద్యార్థులను ఆధార్ కోసం బలవంత పెడుతున్నారన్నారు. కేవలం ఆధార్, అపార్ ఐడీలు లేవన్న కారణంతో విద్యార్థులను పరీక్షలకు అనుమతించకపోవడం విద్యాహక్కు చట్టానికి, రాజ్యాంగానికి విరుద్ధమని వాదించారు. డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ చట్టం--2023 నిబంధనల ఉల్లంఘన జరుగుతోందని తెలిపారు.

**కేంద్రం కూడా అభ్యంతరం తెలపలేదు.**

అపార్ సమ్మతి పత్రంలో ‘ఆప్ట్ --అవుట్’ఆప్షన్ స్పష్టంగా ఉండాలంటూ ఒడిశా హైకోర్టు గతంలో ఇచ్చిన తీర్పును ధర్మాసనం ఈ సందర్భంగా సమరి?థంచింది. ఆ తీర్పుపై కేంద్ర ప్రభుత్వం కూడా అభ్యంతరం తెలపలేదని గుర్తు చేసింది. అదే తీర్పును దేశవ్యాప్తంగా అమలు చేసేలా సీబీఎస్ఈకి మార్గదర్శకాలు జారీ చేస్తామని తెలిపింది. డేటా ప్రొటెక్షన్, సమ్మతి వంటి అంశాలపై అభ్యంతరాలను కూడా పరిశీలించాలని కోరుతామంది. ఈ పథకం పూర్తిగా స్వచ్ఛందంగానే ఉండాలని, సమ్మతి పత్రాల్లో తల్లిదండ్రులకు తిరస్కరించే అవకాశాన్ని తప్పనిసరిగా కల్పించాలని తేల్చిచెప్పింది. విద్యార్థుల డేటా గోప్యత, తదితర అభ్యంతరాలపై సమగ్ర పరిశీలన జరపాలని సీబీఎస్ఈని ఆదేశిస్తూ తదుపరి విచారణను వాయిదా వేసింది.

**ప్రతి దాన్నీ అనుమానించొద్దు...**

దేశంలో జరిగే ప్రతీ పరిణామాన్ని అనుమానపు దృష్టితో చూడొద్దని సుప్రీంకోర్టు హితవు పలికింది. విద్యార్థుల విద్యా ప్రణాళిక, రికార్డుల నిర్వహణ కోసం ఒకే విశిష్ట గుర్తింపు తీసుకురావడం మంచి పరిణామమేనని, దీనిని స్వాగతించాలని అభిప్రాయపడింది. దేశంలో డేటా భద్రతా చట్టం అమలులో ఉందని, ఎవరూ దానిని ఉల్లంఘించడానికి వీల్లేదని వ్యాఖ్యానించింది. అయితే, సేకరించిన విద్యార్థుల డేటాను ఏ ఉద్దేశం కోసం తీసుకున్నారో, ఆ విద్యా సంబంధిత అవసరాలకు మాత్రమే ఉపయోగించాలని స్పష్టం చేసింది.

# తొలి రోజే దుమారం

**న్యూఢిల్లీ:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాల తొలి రోజు సమావేశాలు విపక్షాల నినాదాల హోరులో కొట్టుకుపోయాయి. ఎలాంటి చర్చలు జరగకుండానే లోక్‌సభ, రాజ్యసభలు సోమవారం అర్ష?ధంతరంగా ముగిసి మంగళవారానికి వాయిదాపడ్డాయి. ప్రతిష్టాత్మక నీట్ ప్రశ్నపత్రాల లీకేజీ, అయోధ్య రామ మందిరంలో కోట్ల రూపాయల విరాళాల చోరీ, జంతర్‌మంతర్ వద్ద విద్యార్థులపై లాఠీచార్జ్ తదితర కీలకాంశాలపై చర్చ చేపట్టాలంటూ విపక్ష పార్టీల నేతలు పట్టుబట్టడంతో పార్లమెంట్ ఉభయసభల్లో తొలిరోజే ప్రతిష్టంభన నెలకొంది. ‘ఇండియా’కూటమి నేతల ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో ఉభయసభలు హోరెత్తిపోయాయి. తామిచ్చిన వాయిదా తీర్మానాలపై చర్చ కు విపక్షాలు పట్టుబట్టాయి. దీంతో లోక్‌సభలో ప్రశ్నోత్తరాలు, జీరో అవర్ సమయం వృథాగా ఖర్చయిపో యాయి. సభాకార్యకలాపాలకు విపక్ష సభ్యులు అడ్డుతగలడంతో లోక్‌సభ, రాజ్యసభలు తలో ఆరుసార్లు వాయిదాపడ్డాయి. ఉభయ సభాపతులు ఇరుసభలను మంగళవారానికి వాయిదావేశారు.



**ఆరంభం నుంచే అట్టుడికిన లోక్‌సభ..**

ఉదయం 11 గంటలకు లోక్‌సభ ప్రారంభమైన వెంటనే మరణించిన మాజీ ఎంపీలకు నివాళులు అర్పించారు. అనంతరం స్పీకర్ ఓం బిర్లా ప్రశ్నోత్తరాల సమయాన్ని ప్రారంభించేందుకు ప్రయత్నించినప్పటికీ ప్రతిపక్ష సభ్యులు వివిధ అంశాలపై చర్చ కోరుతూ వెంటనే నినాదాలు చేశారు. సభ నినాదాలతో నడవదని, సభ్యులు తమ స్థానాల్లో కూర్చొని సభా కార్యక్రమాలకు సహకరించాలని స్పీకర్ బిర్లా విజ్ఞప్తి చేశారు. అయినప్పటికీ కాంగ్రెస్, ఎస్పీ, ఆర్జేడీసహా పలు ప్రతిపక్ష సభ్యులు తమ స్థానాల్లోంచి లేచి ముందుకొచ్చి ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. నినాదాలతో లోక్‌సభలో గందరగోళం నెలకొనడంతో స్పీకర్ ఓం బిర్లా సభ్యులను శాంతించాలని మరోమారు కోరారు. అయినప్పటికీ ప్రతిపక్ష సభ్యుల ఆందోళనలు కొనసాగడంతో మొదట మధ్యాహ్నం 12 గంటల వరకు సభను వాయిదా వేశారు. అనంతరం తిరిగి ప్రారంభం అయ్యాక విపక్షాల ఆందోళన కొనసాగడంతో వాయిదాల పర్వం కొనసాగి, చివరికి సభ మంగళవారానికి వాయిదా పడింది.

**రాజ్యసభలోనూ వాయిదాల పర్వం..**


రాజ్యసభలో పత్రాల సమర్పణ, నూతన సభ్యుల ప్రమాణస్వీకారం, మృతిచెందిన సభ్యులకు సంబంధించిన సంతాప తీర్మానాల అనంతరం సభా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. వెంటనే రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున ఖర్గే మాట్లాడారు. నీట్ ప్రశ్నపత్రాల లీకేజీ అంశాన్ని ప్రస్తావించారు. “జంతర్‌మంతర్‌లో నిరసన తెలుపుతున్న విద్యార్థుల గొంతు ప్రభుత్వం నొక్కేస్తోంది. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన సమస్యపై చర్చ జరగాల్సిందే. జంతర్‌మంతర్‌లో నిరసన తెలుపుతున్న విద్యార్థులపై ప్రభుత్వం బలప్రయోగం, లాఠీఛార్జి చేస్తోంది. వారి గొంతును అణచివేస్తోంది”అని ఖర్గే అన్నారు. ఖర్గే వ్యాఖ్యలపై అధికార కూటమి ఎంపీలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో సభలో గందరగోళం నెలకొంది. పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్ మధ్యాహ్నం 12 గంటల వరకు సభను వాయిదావేశారు. తర్వాత సభ మొదలైనా పరిస్థితి అలాగే కొనసాగింది. జంతర్‌మంతర్‌లో విద్యార్థులపై లాఠీచార్జ్ చేసిన పోలీసులపై చర్య తీసుకోవాలని విపక్ష సభ్యులు డిమాండ్ చేశారు. అయోధ్యలోని రామమందిరంలో కోట్ల రూపాయల విరాళాలను చోరీచేసిన ఉదంతంపై చర్చ జరపాలని పట్టుబట్టారు. ఈ డిమాండ్లు, నినాదాల నడుమ సభ మంగళవారానికి వాయిదా పడింది.

**లోక్‌సభ ముందుకు జడ్జీల బిల్లు..**

ఇంతటి నినాదాల హోరులోనూ ప్రభుత్వం లోక్‌సభలో ఒక బిల్లును విజయవంతంగా ప్రవేశపెట్టింది. సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్యను పెంచేందుకు గతంలో జారీచేసిన ఆర్డినెన్స్ స్థానంలో రూపొందించిన బిల్లును లోక్‌సభలో న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ ప్రవేశపెట్టారు.

# అంతరిక్ష రంగంలో యువత అద్భుతాలు

**న్యూఢిల్లీ:** ఈ సంవత్సరం వర్షాలు సమృద్ధిగా కురవాలని, అదేమాదిరి వర్షాకాల సమావేశాలు ఫలప్రదంగా సాగాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం సందర్భంగా సోమవారం ఆయన పార్లమెంట్ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడారు. “రెండూ బాగుంటేనే దేశం సుభిక్షంగా ఉంటుంది. అప్పుడు అందరి జీవితాల్లో వెలుగులు నిండుతాయి. ఇదే ఆశతో ఈసారి వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుకుందాం. అదే విధంగా ఈసారి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సైతం ఫలప్రదంగా సాగాలనీ కోరుకుందాం. సభలో నిర్మాణాత్మక చర్చల ద్వారా దేశ ప్రగతికి, ప్రజా సంక్షేమానికి దోహదపడాలి. రాజకీయాలకు అతీతంగా అనుభవజ్ఞులైన ఎంపీల విజ్ఞానం దేశాభివృద్ధి కోసం ఉపయోగపడాలి. బలమైన వాదనలు ఉన్నప్పుడు ప్రశాంతంగా మాట్లాడినా మన గళాన్ని సమర్థవంతంగా వినిపించవచ్చు”అని మోదీ చెప్పారు. “దేశ పురోగతిలో యువత పాత్ర అత్యంత కీలకం. వారి సామర్థ్యాలు, ఆకాంక్షలు అంతరిక్షమంత విశాలమైనవి. గడిచిన నెల రోజుల్లో జాతీయ, అంతర్జాతీయ, అంతరిక్ష రంగాల్లో అసాధారణ మైలురాళ్లను భారత్ అధిగమించింది. భారతీయ వ్యోమగామి గత ఏడాది వర్షాకాల సమావేశాల ముందు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లారు. ఈసారి వర్షాకాల సమావేశాలకు ముందు భారతీయ అంకుర సంస్థ స్కైరూట్ ప్రయోగించిన విక్రమ్--1 రాకెట్ విజయవంతంగా గగనతలంలోకి వెళ్లింది. భారతీయ యువత ఆశలు, ఆశయాలకు నింగిలాగా ఎలాంటి హద్దుల్లేవనడానికి ఈ విజయమే నిదర్శనం”అని మోదీ కొనియాడారు.



**7.7 శాతం వృద్ధిరేటు...**

“పశి?చమాసియాలో యుద్ధ పరిస్థితుల వల్ల అంతర్జాతీయంగా పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ, ఎరువులు, రసాయనాల దిగుమతులపై తీవ్ర ప్రభావం పడినప్పటికీ భారతదేశం 7.7 శాతం వృద్ధిరేటును నమోదుచేసింది. ప్రపంచంలోనే వేగంగా వృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలవడం దేశానికున్న అపారమైన శక్తికి నిదర్శనం”అని మోదీ అన్నారు.

**56 ఏళ్ల యువకుని గురించి మాట్లాడట్లేదు**

**రాహుల్‌కు మోదీ చురక**

స్కైరూట్ సంస్థ విజయం గురించి మాట్లాడుతూ రాహుల్ గాంధీనుద్దేశిస్తూ మోదీ పరో క్షంగా వ్యంగ్య వ్యాఖ్యలుచేశారు. యువకులు ఎంతో సాధిస్తున్నారని, రాహుల్ 56 ఏళ్లు వచ్చినా పార్టీని అధికారంలోకి తీసుకురావడంలో విఫలమయ్యారనే అర్థం ధ్వనించేలా మోదీ పరోక్షంగా చురకలంటించారు. “అంతరిక్షంలో అద్భుతం సృష్టించిన స్కైరూట్ అంకురసంస్థలోని బృంద సభ్యుల సగటు వయస్సు కేవలం 28 ఏళ్లు మాత్రమే. యువత అద్భుతాలు చేస్తోంది. నేనిక్కడ 56 ఏళ్ల యువకుడి(రాహుల్) గురించి మాట్లాడటం లేదు. 28 ఏళ్ల వయస్సున్న దేశీయ యువతే అంతరిక్షంలో భారత జెండాను ఎగరేసింది”అని మోదీ వ్యాఖ్యానించారు. ప్రైవేట్ రంగానికి కల్పించిన సంస్కరణల వల్లే సాహసోపేతమైన విజ యాలను యువత సాధిస్తోందని మోదీ అన్నారు.


## కోరలు చాస్తున్న పేదరికం




దాయాది దేశం పాకిస్థాన్‌ను పేదరికం చుట్టుముడుతోంది. గడిచిన ఆరేళ్లలో దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్ర ఒడిదొడుకులకు లోనుకావడంతో నిరుపేదల సంఖ్య ప్రమాదకర స్థాయిలో పెరిగిపోయింది. వరుస ఆర్థిక సంక్షోభాలు, అధిక ద్రవ్యోల్బణం, బలహీనమైన వృద్ధి రేటు వంటి కారణాలతో కుటుంబ ఆదాయాలు గణనీయంగా క్షీణించాయి. ఫలితంగా దేశ జనాభాలో దాదాపు 29 శాతం మంది పేదరిక రేఖకు దిగువన జీవిస్తున్నారని ఒక తాజా నివేదిక వెల్లడించింది. 2018-19లో 21.8 శాతంగా ఉన్న పేదరికం, 2024-25 నాటికి 28.9 శాతానికి చేరింది. అంటే కేవలం ఆరేళ్లలోనే పేదరికం 7 శాతం పెరిగింది. హౌస్‌హోల్డ్ ఇంటిగ్రేటెడ్ ఎకనామిక్ సర్వే (హెచ్ఐఈఎస్), పాకిస్థాన్ సోషల్ అండ్ లివింగ్ స్టాండర్డ్స్ మెజర్‌మెంట్ (పీఎస్ఎల్ఎం) డేటా ఆధారంగా ‘డాన్’ పత్రిక ఈ విశ్లేషణను ప్రచురించింది. దాదాపు ఆరేళ్ల విరామం తర్వాత విడుదలైన ఈ గణాంకాలు.. దేశం ఎదుర్కొన్న బహుళ సంక్షోభాల ప్రభావాన్ని స్పష్టం చేస్తున్నాయి. పట్టణ ప్రాంతాలతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాలపై ఈ ప్రభావం మరింత తీవ్రంగా ఉంది. గ్రామీణ పాకిస్థాన్‌లో పేదరికం సుమారు 8 శాతం మేర పెరగగా, పట్టణ ప్రాంతాల్లో ఇది 6 శాతంగా నమోదైంది. పదేపదే తలెత్తిన చెల్లింపుల సంక్షోభం, కోవిడ్-19 మహమ్మారి, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, దీర్ఘకాలిక స్థూల ఆర్థిక సర్దుబాట్లు వంటివి ఈ దుస్థితికి ప్రధాన కారణాలుగా నిలిచాయి. విశ్లేషకులు ఈ పరిస్థితిని జీవన ప్రమాణాల మెరుగుదల విషయంలో ‘కోల్పోయిన దశాబ్దం’గా అభివర్ణిస్తున్నారు. గత రెండు సర్వేల మధ్య కాలంలో ద్రవ్యోల్బణాన్ని సర్దుబాటు చేసిన తర్వాత చూస్తే, సగటు కుటుంబ ఆదాయాలు, వినియోగం గణనీయంగా తగ్గినట్లు నివేదిక పేర్కొంది. ఆర్థిక వృద్ధి సానుకూలంగా ఉన్నప్పటికీ, పేదరికం పెరగడం ఆందోళన కలిగించే అంశం. ఈ వృద్ధి ఫలాలు ఎక్కువగా ఉన్నత ఆదాయ వర్గాలకే చేరాయని, దిగువ ఆదాయ వర్గాల వాస్తవ ఆదాయాలు, కొనుగోలు శక్తి తీవ్రంగా దెబ్బతిన్నాయని ఇది సూచిస్తోంది.

పేద కుటుంబాలు ఎక్కువగా రోజువారీ వేతనాలపై ఆధారపడతాయి. అధిక ద్రవ్యోల్బణం, ఆర్థిక అంతరాయాల వల్ల ఈ వర్గాలే ఎక్కువగా నష్టపోయాయి. మరోవైపు, సంపన్న వర్గాలు రియల్ ఎస్టేట్, ఆర్థిక పెట్టుబడుల వంటి ఆస్తులను కలిగి ఉండటంతో, ధరల పెరుగుదల ప్రభావాన్ని తట్టుకోగలిగారు. దీంతో దేశంలో ఆదాయ అసమానతలు మరింత పెరిగాయి. ప్రస్తుత భౌగోళిక రాజకీయ అనిశ్చితులు, బాహ్య ఆర్థికపరమైన రిస్కుల మధ్య, పెరుగుతున్న పేదరికాన్ని, విస్తరిస్తున్న అసమానతలను పరిష్కరిస్తూనే ఆర్థిక వృద్ధిని కొనసాగించడం పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థకు పెను సవాలుగా మారింది.

## డిమాండ్లు నెరవేరే వరకు ఆందోళనలు కొనసాగుతాయి



నీట్-యూజీ 2026 ప్రశ్నాపత్రం లీకేజీతో పాటు పలు పరీక్షల్లో జరిగిన అవకతవకలపై ఆరోపణలు వెల్లువెత్తడంతో ఢిల్లీలో నిరసనలు ఉధృతమయ్యాయి. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో ఆందోళనలు కొనసాగుతున్న నేపథ్యంలో, కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నేతలు సోమవారం కేంద్ర మంత్రి జేపీ నడ్డాతో భేటీ అయ్యారు. సీజేపీ ప్రతినిధులు సౌరవ్ దాస్, అశుతోష్ రంకా ఢిల్లీలోని నడ్డా నివాసంలో సుమారు 10 నిమిషాల పాటు సమావేశమై, తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆయనకు అందజేశారు. ఈ సమస్యపై అంతర్గతంగా ఉన్నత స్థాయిలో చర్చిస్తామని మంత్రి హామీ ఇచ్చారని, అయితే ఎటువంటి నిర్దిష్ట హామీలు లభించలేదని సౌరవ్ దాస్ ‘ఎక్స్’ వేదికగా వెల్లడించారు. తమ డిమాండ్లు నెరవేరే వరకు శాంతియుత పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం రోజే సీజేపీ ‘పార్లమెంట్ ముట్టడి’కి పిలుపునివ్వడంతో జంతర్ మంతర్ వద్దకు విద్యార్థులు, యువత భారీగా చేరుకున్నారు. అక్కడి నుంచి పార్లమెంట్ వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించిన నిరసనకారులను పోలీసులు అడ్డుకున్నారు. నిషేధాజ్ఞలు అమల్లో ఉన్నప్పటికీ ముందుకు వెళ్లేందుకు యత్నించిన ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు కొన్నిచోట్ల లాఠీఛార్జ్ చేయడంతో పాటు బాష్పవాయువును ప్రయోగించారు. సోషల్ మీడియాలో ఒక వ్యంగ్య ఉద్యమంగా ఆరంభమైన కాక్రోచ్ జనతా పార్టీ, ప్రస్తుతం పరీక్షల లీకేజీలు, సాంకేతిక వైఫల్యాలపై నిరంతరాయంగా పోరాడుతోంది. ఈ ఉద్యమానికి మద్దతుగా పర్యావరణవేత్త సోనమ్ వాంగ్‌చుక్ సుదీర్ఘ నిరాహార దీక్ష చేపట్టారు. ఆందోళనలు ప్రారంభమైన తర్వాత సీజేపీ నేతలతో కేంద్ర ప్రభుత్వం ఉన్నత స్థాయిలో చర్చలు జరపడం ఇదే ప్రథమం. తమ డిమాండ్లు నెరవేరే వరకు శాంతియుత నిరసనలు కొనసాగిస్తామని సీజేపీ నాయకత్వం తేల్చిచెప్పింది.

## జగన్నాథుడి ఆభరణాల లెక్కింపు పూర్తి!

పూరి: ఒడిశా పవిత్ర పుణ్యక్షేత్రం పూరి జగన్నాథుడి ఆభరణాల భాండాగారం రత్నభాండార్ ప్రత్యేక లెక్కింపు పూర్తయినట్లు అధికారులు ప్రకటించారు. అంతర్జాతీయ ప్రఖ్యాత పూరి జగన్నాథ యాత్ర ముగిసి జగన్నాథ, బలభద్రులు ఇద్దరు గుండిచ దేవస్థానంలోకి ప్రవేశించిన తరువాత ఈ ప్రత్యేక పరిశీలన నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.ఒడిశా ప్రభుత్వం నిర్దేశించిన రీతిలో ఆదివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. దేవాలయంలోని వేర్వేరు పండుగల నేపథ్యంలో రత్నభాండార్ ప్రత్యేక పరిశీలన కార్యక్రమాన్ని మే నెల 23వ తేదీన నిలిపివేసిన విషయం తెలిసిందే. గత నెలలో స్నాన పూర్ణిమ సందర్భంగా ఉత్సవమూర్తుల నుంచి తొలగించిన ఆభరణాల లెక్కింపు, బరువు తూచడం వంటివి చేశారు. ‘రాహు రేఖ’, బంగారు ‘చితా’, వెండి ‘రసిక’ఆభరణాలతోపాటు విగ్రహాలకు సంబంధించిన ఇతర ఆభరణాలను కూడా లెక్కించామని, శ్రీ జగన్నాథ్ దేవాలయ అడ్మినిస్ట్రేషన్ ప్రధాన అడ్మినిస్ట్రేటర్ అరబింద పాధే తెలిపారు. “డిజిటల్ డాక్యుమెంటేషన్‌లో భాగంగా లెక్కింపు, బరువు తూచే ప్రక్రియ మొత్తాన్ని వీడియో తీశాం”అని ఆయన తెలిపారు. ఆభరణాల్లోని రత్నాలు, ఇతర విలువైన రాళ్లను నిపుణులు పరిశీలించారని, తెలిపారు. ప్రభుత్వం ఆమోదించిన ప్రామాణిక ప్రక్రియకు అనుగుణంగా లెక్కింపు ప్రక్రియ పూర్తిచేసినట్లు రత్నభాండార్ పరిశీలన కమిటీ అధ్యక్షులు జస్టిస్ (రిటైర్డ్) బిశ్వనాథ్ రథ్ తెలిపారు. దేవాలయానికి సంబంధించి రెండు రత్నభాండార్‌లు ఉంటే అందులోని బయటి భండాగారం లెక్కింపు ప్రక్రియ ప్రస్తుతం పూర్తవగా లోపలి దాని లెక్కింపు కొనసాగుతున్నట్లు మరో అధికారి తెలిపారు.

# ఆపదలో అండగా... ఆర్టీసీ ఒకే కుటుంబం..!


-మొదటిపేజీ తరువాయి

స్వచ్ఛందంగా సేకరించిన రూ. 90,85,500 (తొంభై లక్షల ఎనభై ఐదు వేల ఐదు వందల రూపాయల) భారీ ఆర్థిక సహాయ చెక్కును సోమవారం హైదరాబాద్‌లోని ఆర్టీసీ కళాభవన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో శంకర్ కుటుంబ సభ్యులకు అందజేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్, ఎండీ వై.నాగిరెడ్డి ల చేతుల మీదుగా దివంగత డ్రైవర్ సతీమణి హేమలత, కుమారుడు హేమంత్, కుమార్తె షాలినిలకు ఈ చెక్కును అందజేసి సంస్థ తరఫున పూర్తి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, కార్మికుల కోసం ప్రాణత్యాగం చేసిన దివంగత కోల శంకర్ కుటుంబానికి ఆర్టీసీ ఉద్యోగులందరూ అండగా నిలవడం వారి మానవత్వానికి నిదర్శనమన్నారు. శంకర్ ఆసుపత్రిలో ఉన్న సమయంలో అర్ధరాత్రి వేళ స్వయంగా వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న విషయాన్ని మంత్రి ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు.

ఆ కుటుంబానికి ప్రజా ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, అందులో భాగంగానే దివంగత శంకర్ కుమారుడు హేమంత్‌కు ఆర్టీసీలో ఉద్యోగం కల్పిస్తున్నామని, అలాగే ఆ కుటుంబానికి ఇల్లు కూడా మంజూరు చేశామని ప్రకటించారు.

గత ప్రభుత్వాల కాలంలో ఆర్టీసీ కార్మిక సంఘాలను ఎత్తివేసి, నిరంకుశంగా వ్యవహరించారని మంత్రి విమర్శించారు. అయితే రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆర్టీసీలోని ప్రతి సమస్యను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ వస్తున్నామని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించే మహాలక్ష్మి పథకం ప్రారంభమైనప్పటి నుండి ప్రభుత్వం నెలకు రూ. 300 కోట్లు ఆర్టీసీకి విడుదల చేస్తోందని, ఈ పథకం వల్ల పనిభారం పెరిగినప్పటికీ సిబ్బంది ఎంతో కష్టపడి విజయవంతం చేస్తున్నారని కొనియాడారు. ముఖ్యంగా రాఖీ పౌర్ణమి వంటి పండుగ రోజుల్లోనూ మహిళా ప్రయాణికుల కోసం కార్మికులు తమ సోదరులకు రాఖీ కట్టి మరీ విధులు నిర్వహించడం వారి నిబద్ధతకు అద్దం పడుతోందన్నారు.

కార్మికుల సంక్షేమంతో పాటు వారి కుటుంబాల భద్రతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, రూ. 6 లక్షల లోపు వార్షిక ఆదాయం ఉన్న ఆర్టీసీ ఉద్యోగులు, అవుట్ సోర్సింగ్ సిబ్బందితో సహా ప్రతి ఒక్కరూ ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని మంత్రి స్పష్టం చేశారు. రిటైర్డ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కూడా తగిన చర్యలు




తీసుకుంటున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో సంస్థ పరిరక్షణ, ప్రయాణికుల సౌలభ్యం, కార్మికుల సంక్షేమం అనే మూడు ప్రధాన అంశాల ఆధారంగా సంస్థను ముందుకు తీసుకెళ్తామన్నారు. కార్మిక సంఘాల ఎన్నికల అనంతరం నలుగురు మంత్రులు, అధికారుల కమిటీ తీసుకున్న నిర్ణయం మేరకు ఆర్టీసీ విలీన ప్రక్రియను కూడా ప్రారంభిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అలాగే క్యూర్ ఏరియా పరిధిలో అత్యాధునిక బస్ టెర్మినల్ నిర్మిస్తామని, గ్రామాల నుండి రాజధాని వరకు కొత్త రూట్లలో బస్సులు నడుపుతూ, మెట్రో మరియు వీమీూ సర్వీసులతో ఆర్టీసీని అనుసంధానం చేసి రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామని వెల్లడించారు. ఆర్టీసీ పేదవాడి గుండె చప్పుడు అని, కాబట్టి యాజమాన్యం తీసుకుంటున్న సంక్షేమ, అభివృద్ధి చర్యల్లో ఉద్యోగులంతా మరింత బాధ్యతగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వై. నాగిరెడ్డి మాట్లాడుతూ తోటి ఉద్యోగి కుటుంబం కష్టాల్లో ఉన్నప్పుడు సంస్థలోని సిబ్బంది అంతా ఏకతాటిపైకి వచ్చి రూ. 90.85 లక్షల భారీ ఆర్థిక సహాయాన్ని అందించడం ఆర్టీసీ ఉద్యోగులలో ఉన్న అంతర్గత బంధానికి, పరస్పర సహకారానికి ఒక గొప్ప నిదర్శనమన్నారు. సాయం చేయడానికి ముందుకు వచ్చిన ప్రతి ఒక్క ఉద్యోగికి ఆయన హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఒక ఉద్యోగి కష్టంలో ఉంటే మొత్తం సంస్థ అండగా నిలవాలనే గొప్ప సంస్కృతి టీజీఎస్ ఆర్టీసీ సొంతమని, ఈ కార్యక్రమం ఆ విలువలను మరోసారి చాటిచెప్పిందన్నారు.

ఉద్యోగుల సంక్షేమం కోసం యాజమాన్యం కట్టుబడి ఉందని, సిబ్బందికి అవసరమైన భద్రత, శిక్షణ, పని పరిస్థితుల మెరుగుదల కోసం నిరంతర చర్యలు తీసుకుంటున్నామని ఎండీ స్పష్టం చేశారు. ప్రయాణికుల భద్రతే తమ తొలి ప్రాధాన్యమని, ప్రతి డ్రైవర్, కండక్టర్ అత్యంత బాధ్యతతో విధులు నిర్వహిస్తూ ప్రజలను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుస్తున్నారని, వారి సేవలు అమూల్యమైనవని కొనియాడారు. సంస్థ ఆర్థిక బలోపేతంతో పాటు ఉద్యోగుల సంక్షేమం కూడా సమానంగా ముఖ్యమని యాజమాన్యం విశ్వసిస్తోందని, వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు తాము అందుబాటులో ఉంటామన్నారు. ప్రయాణికులకు నాణ్యమైన, సురక్షితమైన, సమయపాలనతో కూడిన సేవలు అందించేందుకు డిజిటల్ సేవలు, ఆన్‌లైన్ టికెటింగ్, బస్సుల ఆధునీకరణ వంటి ఆధునిక సాంకేతికతను విస్తృతంగా వినియోగిస్తున్నట్లు తెలిపారు.

## ఆదిలాబాద్ జిల్లాలో పారిశ్రామిక పార్కు భూసేకరణలో

# మాయాజాలం

**రూ. కోట్లు కొట్టేసేందుకు అధికార పార్టీలోని బడా నేతలు, విపక్ష ఎమ్మెల్యే కుమ్మక్కు?**

**ఓ సంస్థ భూములను వేలంలో కొన్న మరో సంస్థ.. మ్యుటేషన్ జరగకపోవడంతో రంగంలోకి అక్రమార్కులు**

**500 ఎకరాలకుపైగా భూముల పరిహారం నొక్కేసేందుకు ఇతరుల పేరిట భూములు మార్చి దోపిడీకి స్కెచ్!**

**భూ బదలాయింపు జాబితాలో ఓ సిమెంట్ కంపెనీ సహా కొందరు వ్యక్తులు**

**ఈ వ్యవహారంపై విచారణ జరిపితే అక్రమాలు నిగ్గుతేలే అవకాశం**

**హైదరాబాద్:** ఆదిలాబాద్ జిల్లాలో పారిశ్రామిక పార్కు ఏర్పాటు కోసం ప్రభుత్వం విడుదల చేసిన భూసేకరణ నోటిఫికేషన్‌ను అడ్డుపెట్టుకొని పరిహారం కొట్టేసేందుకు కొందరు అక్రమార్కులు స్కెచ్ వేశారు. బ్యాంకులో తనఖాలో ఉన్న ఓ ప్రైవేటు సంస్థకు చెందిన భూములను అక్రమంగా తమ పేరిట రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేసుకున్నారు. సదరు ప్రైవేటు సంస్థ బ్యాంకులో తనఖా పెట్టిన భూములు ఆ సంస్థ పేరిట మ్యుటేషన్ కాకపోవడాన్ని అనువుగా మలుచుకున్నారు. దీంతో ప్రభుత్వం జారీ చేసిన భూసేకరణ నోటిఫికేషన్‌లో అడ్డదారిలో రెవెన్యూ రికార్డుల్లోకి ఎక్కిన అక్రమార్కులనే పట్టాదారులుగా పేర్కొన్నారు. దీంతో తమవి కాని భూములపై రూ. కోట్లలో పరిహారం కొట్టేసేందుకు భూసేకరణ నోటిఫి కేషన్‌ను అక్రమార్కులు అడ్డుపెట్టుకున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. పరిహారం కొట్టేసేందుకే పారి శ్రామిక పార్కు ఏర్పాటు ప్రతిపాద నను తెర పైకి తెచ్చారని విమర్శలు కూడా ఉన్నాయి. ఈ ప్రయత్నాలకు అధికార పార్టీకి చెందిన బడా నేతలతోపాటు విపక్ష పార్టీకి చెందిన శాసనసభ్యుడి సహకారం ఉందని సమాచారం. కేంద్రంలో రోజూ కత్తులు దూసు కునే పార్టీల ముఖ్య నేతలు పరిహారం కొట్టేసేందుకు కలసి కట్టుగా కుట్ర పన్నినట్లు ఆరోపణలు వస్తున్నా యి.

### ముందు కొన్నదొకరు.. వేలంలో కొన్నదొకరు

ఆదిలాబాద్ జిల్లా భోరజ్ మండలం హత్తీఘాట్, రాంపూర్, గూడ, గిమ్మబి గ్రామాల్లో 2062.01 ఎకరాల్లో పారిశ్రామిక పార్కు ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఇందులో భాగంగా హత్తీఘాట్ పరిధిలో 1,194.10 ఎకరాలు, గూడలో 259.23 ఎకరాల భూసేకరణకు మే 29న రెవెన్యూ శాఖ ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల చేసింది. హత్తీఘాట్‌లో 298 సర్వే నంబర్లు, గూడలో 83 సర్వే నంబర్ల పరిధిలోని భూమిని సేకరిస్తున్నట్లు యజమానుల పేర్లతో నోటిఫికేషన్ ఇచ్చింది. అయితే జీఎస్ బయోటెక్ లిమిటెడ్ అనే సంస్థ బ్యాంకులో తనఖా పెట్టిన భూములు కూడా ఇందులో ఉన్నాయి. ఆదిలాబాద్‌కు చెందిన ఈ సంస్థ.. ఆదిలాబాద్, మంచిర్యాల, ఆసిఫాబాద్‌తోపాటు మహారాష్ట్రలోని నాందేడ్‌లో స్థానికుల నుంచి 3,103.41 ఎకరాల భూమి కొనుగోలు చేసింది.

కాలక్రమంలో ఈ భూములను ఎస్‌బీఐ, యుకో, బ్యాంక్ ఆఫ్ మారిషస్ వంటి బ్యాంకుల్లో తనఖా పెట్టి రూ. వందల కోట్లు



రుణం తీసుకుంది. అయితే జీఎస్ బయోటెక్ రుణాలు చెల్లించకపోవడంతో ఎస్‌బీఐ నేషనల్ కంపెనీ ఆఫ్ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ)ను ఆశ్రయించింది. 2022 చివరి నాటికే తమకు రూ. 770 కోట్లకుపైగా రావాల్సి ఉందని ఎస్‌బీఐ పేర్కొంది. ఈ నేపథ్యంలో 2023 మార్చిలో హైదరాబాద్ ఎన్‌సీఎల్‌టీ దివాలా ప్రక్రియను ప్రారంభించినా అది ముందుకు సాగలేదు. దీంతో కంపెనీ ఆస్తుల విక్రయానికి (లిక్విడేషన్) 2024 సెప్టెంబర్‌లో ఆమోదం లభించింది. 2025 డిసెంబర్ 31న జరిగిన ఈ వేలంలో బెంగళూరుకు చెందిన ఓ సంస్థ రూ. 40.20 కోట్లకు ఆదిలాబాద్ జిల్లా భోరజ్ మండలంలోని భూములతోపాటు మరికొన్ని భూములను దక్కించుకుంది.

ఈ మేరకు జీఎస్ బయోటెక్ లిక్విడేటర్ ఈ ఏడాది జనవరి 12న వేలంలో అత్యధిక బిడ్ వేసిన సంస్థకు లెటర్ ఆఫ్ ఇంటెంట్ (ఎల్‌ఓఐ) కూడా పంపించారు. బిడ్‌ను పొందిన బెంగళూరు సంస్థ.. ఆ భూములను తమ పేరిట రెవెన్యూ రికార్డుల్లో బదలాయింపు చేయాలంటూ అధికారుల చుట్టూ తిరుగుతోంది. ఈ పని కాకపోవడంతో భూసేకరణ నోటిఫికేషన్‌లో సదరు భూములకు సంబంధించిన యజమానిగా ఈ సంస్థ పేరు లేదు. గతంలో జీఎస్ బయోటెక్ పేరిట మ్యుటేషన్ జరగకపోవడంతో ఆ సంస్థ పేరు కూడా లేదు. దీంతో పరిహారం దోపిడీకి తెరలేచిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### అక్రమంగా ఇతరుల పేరిట మార్చి..

గతంలో భూములు అమ్మిన యజమానులతో కుమ్మక్కైన అక్రమార్కులు.. జీఎస్ బయోటెక్‌కు చెందిన 500 ఎకరాలకుపైగా భూములను వక్ర మార్గంలో ఇతరుల పేర్లకు మార్చి దోపిడీకి తెరతీశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ తరహాలో భూములు పొందిన జాబితాలో డెక్కన్ సిమెంట్స్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. విపక్ష ఎమ్మెల్యే కుమారుడు, కుటుంబ సభ్యులతోపాటు రాష్ట్రంలోని అధికార పార్టీకి చెందిన అత్యంత కీలక నేతలు ఇందులో భాగస్వాములుగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. పారిశ్రామిక పార్కు భూసేకరణ కోసం ఇచ్చిన నోటిఫికేషన్‌లోని సర్వే నంబర్లలోని వివరాలు కూడా అనుమానాలను బలపరిచేలా ఉన్నాయి. ప్రస్తుత మార్కెట్ విలువకు 3--4 రెట్లు అధికంగా పరిహారం వచ్చే అవకాశం ఉండటంతో రూ. కోట్లు కొట్టేసే ప్రణాళికల్లో భాగంగానే పారిశ్రామిక పార్కు ఏర్పాటు ప్రతిపాదనను తెరపైకి తెచ్చారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. గతంలో జరిగిన ఏరియల్ సర్వేలో అధికార పార్టీ నేతలతోపాటు విపక్ష ఎమ్మెల్యే కూడా పాల్గొనడాన్ని స్థానికులు ప్రస్తావిస్తున్నారు. సుమారు 500 ఎకరాలకు సంబంధించి జీఎస్ బయోటెక్ భూములను అక్రమార్కులు తమ పేరిట మార్చుకున్నట్లు సమాచారం.

### సర్వే నంబర్ 39లో ఎన్ని అక్రమాలో..!

హత్తీఘాట్ సర్వే నంబర్ 39లోని 33.31 ఎకరాలను జీఎస్ బయోటెక్‌కు చెందిన సుమన్ అగర్వాల్ 2006 డిసెంబర్ 11న (డాక్యుమెంట్ నంబర్ 361/06) కొనుగోలు చేశారు. మరుసటి ఏడాది ఎస్‌బీహెచ్‌కు తనఖా (డాక్యుమెంట్ నంబరు 4790/07) పెట్టారు. అయితే ఇదే భూమిని తూడెం గణేశ్ అనే వ్యక్తి ఉగ్గె సత్యనారాయణ (డాక్యుమెంట్ 7068/2016)కు విక్రయించినట్లు రికార్డుల్లో ఉంది. తిరిగి అదే వ్యక్తి డెక్కన్ సిమెంట్స్‌కు 33.31 ఎకరాలు విక్రయించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం రెవెన్యూ శాఖ జారీ చేసిన భూసేకరణ నోటిఫికేషన్‌లో డెక్కన్ సిమెంట్స్ పేరిట 30.31 ఎకరాలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఇదే తరహాలో గూడ గ్రామంలోని 112/1/3 సర్వే నంబర్ భూములు కూడా విపక్ష ఎమ్మెల్యే కుమారుడు డెక్కన్ సిమెంట్స్‌కు విక్రయించినట్లు తెలుస్తోంది. అలాగే సర్వే నంబర్లు 114, 115, 117తోపాటు పలు సర్వే నంబర్లకు సంబంధించి జరిగిన లావాదేవీలు, లిక్విడేటర్ వేలం వేసిన భూముల్లో సైతం ఇవే సర్వే నంబర్లు ఉండటం అనుమానాలకు తావిస్తోంది. ఈ అంశంపై లోతైన విచారణ జరిపితే అక్రమాలు పూర్తిస్థాయిలో బయటపడే అవకాశం ఉంది.

## ఎల్ నినోను ఎదుర్కొంటాం

**హైదరాబాద్:** ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా సిద్ధంగా ఉందని, రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. నల్లగొండ జిల్లా కలెక్టరేట్ లోని ఉద్యాదిత్య భవన్ లో నల్లగొండ, సూర్యపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల అధికారులతో ఎల్ నినో సంసిద్ధత, ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహంపై సోమవారం (జూలై 20) ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం జరిగింది. ఎల్ నినో ప్రభావం వల్ల రాబోయే రోజుల్లో ప్రజలకు ఎలాంటి తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆదేశించారు. నీటి లభ్యతను బట్టి రైతులు కేవలం వరి పంటపైనే ఆధారపడకుండా, లాభదాయకమైన ప్రత్యామ్నాయ పంటలు వేసేలా అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాకు సాగునీరు అందించే అత్యంత ప్రతిష్టాత్మకమైన శ్రీశైలం ఎడమగట్టు కాలువ సొరంగ మార్గం పనులను 2028 ఆగస్టు నాటికి పూర్తి చేస్తామని మంత్రి ప్రకటించారు. దీని ద్వారా ఉమ్మడి జిల్లాలోని 4 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని వెల్లడించారు. ఈ సొరంగం పనులను వేగవంతం చేయడానికి ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని ఆయన కొనియాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని, ఎలాంటి ప్రకృతి విపత్తులనైనా సమర్థవంతంగా ఎదుర్కొని ప్రజలను ఆదుకుంటామని మంత్రులు ఈ సందర్భంగా ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో పాటు రాష్ట్ర ఇరిగేషన్, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, నల్లగొండ నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు,ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణలో భూసేకరణకు ప్రత్యేక చట్టం

-మొదటిపేజీ తరువాయి

సాగుతోంది. ఈ ప్రక్రియ పూర్తయ్యాక వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ల్యాండ్ పూలింగ్ బిల్లును ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. గుజరాత్, తమిళనాడు, మహారాష్ట్ర రాష్ట్రాల్లో అమలవుతున్న విధానాలు మెరుగ్గా ఉన్నాయని గుర్తించినట్లు తెలుస్తోంది. తెలంగాణలో ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా అమలయ్యే ప్రత్యేక ల్యాండ్ పూలింగ్?కు సంబంధించి ఎటువంటి చట్టం లేదు. అందుకు అనుగుణంగా కొత్త చట్టాన్ని రూపొందించే దిశగా ప్రభుత్వం ముమ్మరంగా అడుగులు వేస్తోంది.

### అటు యజమానులకు, ఇటు ప్రభుత్వానికి లాభం

రాష్ట్రంలో నేషనల్ హైవేలు, రైల్వే లైన్లు, రీజినల్ రింగ్ రోడ్, పారిశ్రామిక కారిడార్లు, ఇండస్ట్రియల్ పార్కులు, టౌన్‌షిప్‌లు, ప్రతిపాదిత హైస్పీడ్ రైలు మార్గాలు, విమానాశ్రయాల విస్తరణ, సాగునీటి ప్రాజెక్టులు వంటి అభివృద్ధి, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు భారీగా భూములు అవసరం అవుతున్నాయి. ప్రస్తుతం ఏదైనా ప్రాజెక్టుకు భూసేకరణ ప్రారంభించగానే తమ భూములు పోతాయనే భయంలో రైతులు ఉంటున్నారు. నిరసన బాట పడుతున్నారు. ఈక్రమంలో ప్రాజెక్టులతో అందరికీ సమానంగా ప్రయోజనం చేకూరే విధానాన్ని రూపొందించాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని ల్యాండ్ పూలింగ్ అధ్యయనం టీంలోని ఒక ఉన్నతాధికారి తెలిపారు.

పూలింగ్‌లో తీసుకున్న భూముల్లో మౌలిక వసతుల ఏర్పాటు అనంతరం కొంత భాగాన్ని ప్లాట్ల రూపంలో తిరిగి భూయజమానులకు కేటాయించే విధానంపై అధికారులు తీవ్ర కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో భారీ సాగునీటి ప్రాజెక్టులు చిన్నచిన్న భూసమస్యల కారణంగా జాప్యానికి గురవుతున్న నేపథ్యంలో ఇరిగేషన్ శాఖను కూడా ఈ ప్రక్రియలో ప్రభుత్వం పాల్గొనేలా చేసింది.

### త్వరలో ఉన్నతాధికారులతో ప్రత్యేక కమిటీ

ల్యాండ్ పూలింగ్ ముసాయిదా బిల్లు ప్రస్తుతం ప్రాథమిక దశలో ఉన్నట్లు సమాచారం. ఈ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లేందుకు, కొత్త విధానానికి తుదిరూపు ఇచ్చేందుకు వివిధ శాఖల ఉన్నతాధికారులతో త్వరలోనే ప్రత్యేక కమిటీని రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తుందని తెలుస్తోంది. ఆ కమిటీ సిఫారసుల ఆధారంగా బిల్లుకు తుది రూపం ఇవ్వనున్నట్లు సంకేతాలు వస్తున్నాయి. భూసేకరణకు చట్టబద్ధ ప్రత్యామ్నాయాన్ని తీసుకురావడం, రాష్ట్రవ్యాప్తంగా ఇంటిగ్రేటేడ్ విధానం వంటి ప్రయోజనాలు ఉంటాయని ప్రభుత్వం భావిస్తోంది.

### ఉప్పల్ భగాయత్ మోడల్, రాష్ట్రవ్యాప్త చట్టబద్ధం

గతంలో హైదరాబాద్‌లోని ఉప్పల్ భగాయత్ ప్రాంతంలో హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్?మెంట్ అథారిటీ భూయజమానుల భాగస్వామ్యంతో ల్యాండ్ పూలింగ్‌ను చేపట్టింది. అందులో కొంత భూమిని మెట్రో రైలు ప్రాజెక్టుకు, ఇతర అవసరాలకు వినియోగించింది. మిగిలిన దాంట్లో కొంత భూమి యజమానులకు అభివృద్ధి చేసిన ప్లాట్ల రూపంలో అందజేసింది. ఈక్రమంలో ఇక్కడ ల్యాండ్ పూలింగ్‌లో అనుభవమున్న హెచ్ఎండీఏలోని ఓ ఉన్నతాధికారికి బిల్లు రూపకల్పనలో కీలక బాధ్యతలు అప్పగించినట్లు సమాచారం.

## క్యూఆర్ కోడ్‌తో స్మార్ట్ రేషన్




-మొదటిపేజీ తరువాయి

లబ్ధిదారులు వాడుతున్న ఏ4 సైజు కాగితపు కార్డులు త్వరగా చిరిగిపోవడం, పాడైపోతుండటంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. కొత్తగా అందించే స్మార్ట్ కార్డులపై లబ్ధిదారుడి వివరాలతో పాటు ప్రత్యేకమైన క్యూఆర్ కోడ్, ఆహార భద్రతా కార్డు నంబర్‌ను ముద్రించారు. భద్రతా ఫీచర్లతో పాటు సీఎం రేవంత్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫొటోలు కూడా ఉంటాయి. ఈ స్మార్ట్ కార్డుల ద్వారా ప్రజా పంపిణీ వ్యవస్థలో మరింత పారదర్శకత వస్తుందని అధికారులు విశ్వసిస్తున్నారు.

రాజధానిలో సీఎం కార్యక్రమాన్ని ప్రారంభిస్తుండగా, అదే సమయంలో రాష్ట్రంలోని మొత్తం 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో స్థానిక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీల చేతుల మీదుగా లబ్ధిదారులకు కొత్త కార్డులు అందజేయనున్నారు. ఈ బృహత్తర కార్యక్రమం కోసం పౌరసరఫరాల శాఖ సమగ్ర ప్రణాళికను రూపొందించింది.

### ఒకేసారి మూడు నెలల బియ్యం


ఇదిలాఉంటే.. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పేదలకు ఇబ్బంది కలగకుండా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలలకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేయనుంది. ఆగస్టు 1 నుంచి నెల రోజుల పాటు రేషన్ దుకాణాలు తెరిచి ఉంటాయి. లబ్ధిదారులు మూడుసార్లు వేలిముద్రలు వేసి తమ కోటాను పొందవచ్చు.

అయితే, ఈసారి రేషన్ సరుకులు పొందాలంటే ఈ-కేవైసీ తప్పనిసరి అని అధికారులు స్పష్టం చేశారు. ఈ-కేవైసీ పూర్తి చేసుకునేందుకు జులై 31ని ఆఖరి తేదీగా నిర్ణయించారు. ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు కూడా తమకు దగ్గరలోని రేషన్ దుకాణంలో ఈ-కేవైసీ పూర్తి చేసుకోవచ్చని అధికారులు సూచించారు. గడువులోగా ఈ-కేవైసీ పూర్తి చేసుకోని వారికి రేషన్ సరుకులు అందవని స్పష్టం చేశారు.

మన తొలివెలుగు


# భార్యల చేతిలో భర్తల 'బలి'

దేశంలో భర్తల భద్రతపై ఆందోళన పెంచుతున్న 'ఏకం న్యాయ్ ఫౌండేషన్' నివేదిక సంచలనం రేపుతోంది. 2026 జనవరి నుండి జులై 14 వరకు ఆరు నెలల కాలంలో ఏకంగా 554 మంది భర్తలు హత్యలు లేదా ఆత్మహత్యల కారణంగా ప్రాణాలు కోల్పోయినట్లు ఈ నివేదిక వెల్లడించింది. ఇందులో 322 మంది భార్యలు లేదా వారి ప్రియుల చేతిలో దారుణంగా హత్యకు గురయ్యారు. మిగిలిన 232 మంది వైవాహిక విభేదాలు, గృహహింస, మానసిక వేధింపుల కారణంగా ఆత్మహత్య చేసుకున్నారు. ప్రతిరోజూ సగటున ఇద్దరు భర్తలు హత్యకు గురవుతుండగా, ఒకరి కంటే ఎక్కువ మంది ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ మరణాల వెనుక వివాహేతర సంబంధాలు, కుటుంబ కలహాలు ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి. కుటుంబ వ్యవస్థలో పెరుగుతున్న అశాంతి పురుషుల జీవితాలను తీవ్ర ప్రమాదంలోకి నెట్టేస్తోంది. ఈ గణాంకాలు సమాజంలో నెలకొన్న విషాదకర పరిస్థితులకు అద్దం పడుతున్నాయి.భర్తలపై జరుగుతున్న హత్యలు, ఆత్మహత్యలపై గురుగ్రామ్‌కు చెందిన ఏకం న్యాయ్ ఫౌండేషన్ విడుదల చేసిన తాజా నివేదిక తీవ్ర చర్చనీయాంశంగా మారింది. 2026 తొలి ఆరు నెలల్లో దేశవ్యాప్తంగా 554 మంది భర్తలు హత్యలు, ఆత్మహత్యలు చోటు చేసుకున్నట్లు ఏకం న్యాయ్ ఫౌండేషన్ సంస్థ వెల్లడించింది. అయితే ఇవి ప్రభుత్వ అధికారిక గణాంకాలు కాదని.. మీడియా కథనాలు, ఫౌండేషన్ సేకరించిన వివరాల ఆధారంగా రూపొందించిన డాక్యుమెంటేషన్ రిపోర్టు మాత్రమేనని స్పష్టం చేసింది.ఈ నివేదిక ప్రకారం.. మొత్తం 322 మంది భర్తలు హత్యకు గురయ్యారని తెలుస్తోంది. వీరిలో అత్యధిక కేసులు భార్యలు లేదా వారి వివాహేతర సంబంధాల నేపథ్యంలో జరిగిన కుట్రలతో ముడిపడి ఉన్నట్లు ఆ సంస్థ పేర్కొంది. మొత్తం హత్యల్లో 194 కేసులు (సుమారు 60.2 శాతం) వివాహేతర సంబంధాల కారణంగానే జరిగినట్లు ఆ రిపోర్టు వెల్లడించింది.



భార్యలు, తమ ప్రియులతో కలిసి కట్టుకున్న భర్తలను హత్య చేసిన ఘటనలు ఎక్కువగా నమోదు అయ్యాయని ఆ నివేదిక తెలిపింది.అదే సమయంలో 232 మంది భర్తలు ఆత్మహత్యలకు పాల్పడినట్లు ఏకం న్యాయ్ ఫౌండేషన్ పేర్కొంది. వీటిలో కుటుంబ కలహాలు, గృహహింస, మానసిక వేధింపులు, తప్పుడు క్రిమినల్ కేసులు, పిల్లలను కలవనివ్వకపోవడం వంటి కారణాలు ప్రధానంగా ఉన్నాయని నివేదికలో వివరించింది. ఈ కేసుల్లో విషం పెట్టి చంపడం, గొంతు నులిమి హత్య చేయడం, విద్యుత్ షాక్ పెట్టి హతమార్చడం, సజీవదహనం చేయడం, మృతదేహాలను ముక్కలు ముక్కలుగా నరకడం, చంపేసి ప్రమాదంగా లేదా ఆత్మహత్యగా చిత్రీకరించడం వంటి అత్యంత దారుణమైన నేరాలు నమోదు అయినట్లు ఆ నివేదిక తెలిపింది.రాష్ట్రాల వారీగా చూస్తే అత్యధికంగా 93 హత్యలు, 103 ఆత్మహత్యలతో ఉత్తరప్రదేశ్ అగ్రస్థానంలో నిలిచినట్లు ఏకం న్యాయ్ ఫౌండేషన్ రిపోర్టు తెలిపింది. ఆ తర్వాత మధ్యప్రదేశ్, రాజస్థాన్, తెలంగాణ, మహారాష్ట్ర, హర్యానా, బీహార్, కర్ణాటక, గుజరాత్ రాష్ట్రాల్లో కూడా ఇలాంటి కేసులు ఎక్కువగా నమోదు అయ్యాయని పేర్కొంది.అయితే.. ఈ నివేదికపై ప్రభుత్వ అధికారిక ధృవీకరణ లేదని ఆ సంస్థ స్పష్టం చేసింది. దేశంలో భర్తల హత్యలు లేదా పురుషులపై గృహహింసకు సంబంధించిన ప్రత్యేక జాతీయ డేటాబేస్ లేకపోవడంతో అసలు సంఖ్య మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని ఏకం న్యాయ్ ఫౌండేషన్ అభిప్రాయం వ్యక్తం చేసింది. ఇటీవల ఉత్తరప్రదేశ్‌లోని మీరట్ జిల్లాలో జరిగిన ఘటన అందరినీ్గ్భ్రాంతికి గురిచేసింది. అతుల్ పవార్ అనే వ్యక్తిని తన భార్య దామిని, ప్రియుడు తుషార్‌తో కలిసి విషసర్పంతో కాటేయించి చంపేసింది. భర్త పేరుపై ఉన్న 20 లక్షల రూపాయల బీమా సొమ్మును కాజేయాలని, ప్రియుడితో కలిసి జీవించాలని ఆమె పన్నిన పన్నాగం ఇది. నిందితులు పామును కొనుగోలు చేసి, నిద్రమాత్రలు కలిపిన పాలు తాగించి ఈ దారుణానికి ఒడిగట్టారు. పోలీసులు సాంకేతిక ఆధారాలు, కాల్ డేటాను విశ్లేషించి నిందితులను అరెస్టు చేశారు. 20 రోజుల క్రితమే కారుతో ఢీకొట్టి చంపేందుకు ప్రయత్నించినట్లు విచారణలో తేలింది. ఈ కేసు భార్యాభర్తల మధ్య పెరిగిపోయిన ద్వేషాన్ని, డబ్బు కోసం ఎంతటి దారుణానికైనా తెగించే కఠిన మనస్తత్వాలను కళ్లకు కట్టినట్లు చూపిస్తోంది. ఇలాంటి ఘటనలు కుటుంబ సంబంధాల పునాదులను పూర్తిగా దెబ్బతీస్తున్నాయి.వైవాహిక జీవితంలో నెలకొంటున్న ఇటువంటి తీవ్రమైన సమస్యలను పరిష్కరించేందుకు కౌన్సెలింగ్, చట్టపరమైన అవగాహన కార్యక్రమాలు అత్యవసరమని నిపుణులు సూచిస్తున్నారు. కేవలం చట్టం మాత్రమే కాకుండా, సామాజిక బాధ్యతతో కుటుంబ వ్యవస్థను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మానసిక ఒత్తిడి, అపార్థాలను తొలగించుకోవడానికి సంభాషణలు మాత్రమే సరైన మార్గం. పురుషులు కూడా తమ సమస్యలను పంచుకునే వేదికలు, మానసిక ఆరోగ్య సేవలు అందుబాటులోకి రావాలి. ఈ గణాంకాలు ప్రభుత్వాలు, సమాజం కలిసి పని చేయాల్సిన సమయం ఆసన్నమైందని హెచ్చరిస్తున్నాయి.

# విద్యార్థుల జీవితాలతో చెలగాటమా!



'ప్రభుత్వం ఈ ఏడాదైనా ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తుందా? ఇవ్వదా? ఒకవేళ ఇవ్వకపోతే లక్షల రూపాయల ఫీజులు ఎక్కడి నుంచి తెచ్చి కట్టాలి? ఉన్నత చదువులు ఎలా కొనసాగించాలి?' ఇదీ ప్రస్తుతం రాష్ట్రంలో లక్షలాది విద్యార్థులు, వారి తల్లిదండ్రులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్న ప్రశ్న. ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో విద్యార్థులు ప్రస్తుతం ఎదుర్కొంటున్నంత మానసిక ఒత్తిడిని మునుపెన్నడూ చవిచూడలేదని విద్యార్థి సంఘాల నేతలు చెప్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను బకాయి పెట్టడం ఒకటైతే, ఈ ఏడాది నుంచి చెల్లింపుల విధానంలో మార్పులు చేయడం మరొకటి! ఇప్పటిదాకా ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను ప్రభుత్వం నేరుగా కాలేజీలకే చెల్లిస్తున్నది. ఈ విద్యా సంవత్సరం నుంచి కాలేజీలకు కాకుండా విద్యార్థుల ఖాతాల్లో జమ చేస్తామని, వాటిని వారు వారం రోజుల్లోగా కాలేజీలకు చెల్లించాలని, అలా చేయకపోతే విద్యార్థుల మీద రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రయోగిస్తామంటూ రేవంత్ సర్కార్ జీవో జారీ చేసింది. ఈ నూతన విధానం ఏ పరిణామాలకు దారితీస్తుందోనన్న ఆందోళన విద్యార్థుల్లో నెలకొన్నది. ఇది ఫీజు రీయింబర్స్‌మెంట్ క్రమంగా ఎత్తివేసే కుట్రగా వివిధ సంఘాలు ఆరోపిస్తున్నాయి.

రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కొలువుదీరిన తరువాత 2023–24, 2024–25, 2025–26 అంటే మూడు విద్యా సంవత్సరాలు ముగిసి పోయాయి. నాలుగో విద్యా సంవత్సరం 2026–27 కూడా ప్రారంభమైంది. రేవంత్ సీఎంగా బాధ్యతలు స్వీకరించిన వేళ ఇంజినీరింగ్ మొదటి సంవత్సరంలో ఉన్న విద్యార్థులు ఇప్పుడు ఫైనలియర్‌కు చేరారు. కానీ, ఆయా విద్యార్థుల తరఫున కాలేజీ యాజమాన్యాలకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను చెల్లించలేదు. దీంతో కాలేజీల నిర్వహణ కష్టంగా మారుతున్నదని, అధ్యాపకులు, సిబ్బందికి వేతనాలు చెల్లించలేపోతున్నామని యాజమాన్యాలు ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి. దీంతో ప్రభుత్వం బకాయిపడ్డ ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని విద్యార్థులే చెల్లించాలని, లేదంటే ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇచ్చేది లేదని చెప్తున్నాయి. మరికొన్ని కాలేజీలు ప్లేస్‌మెంట్స్‌కు సంబంధించిన 'ప్రత్యేక శిక్షణ తరగతులకు' కూడా తమను నిరాకరిస్తున్నాయని ఫీజు రీయింబర్స్‌మెంట్ క్యాటగిరీ విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిజానికి, ఇప్పుడు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, ప్రపంచ ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో జాబ్ మార్కెట్ చాలా డల్‌గా ఉన్నదని, కార్పొరేట్ కంపెనీలు మునుపటిలా 'క్యాంపస్ సెలక్షన్స్' చేపట్టడం లేదని, వందల మందిని రాతపరీక్షలు, ఇంటర్వ్యూలకు పిలిచి కాలేజీకి ఒకరినో ఇద్దరినో రిక్రూట్ చేసుకొంటున్నాయని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల విడుదలలో రాష్ట్ర ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్యం ఇప్పుడు దాదాపు పది పన్నెండు లక్షల కుటుంబాలకు సమస్యాత్మకంగా మారుతున్నది. కాలేజీ యాజమాన్యాలు మెడ మీద కత్తి పెడుతుండటంతో అధిక వడ్డీలకు అప్పులు చేసి, ఫీజులు చెల్లించాల్సిన పరిస్థితిని అనేక కుటుంబాలు ఎదుర్కొంటున్నాయి. ఇది ఆయా కుటుంబాలను ఆర్థిక సంక్షోభంలోకి ఈడ్చుకెళ్తున్నది. నిజానికి, ఉమ్మడి రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని తీసుకొచ్చిందే కాంగ్రెస్ సర్కార్. వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి హ్యూమన్ ఫేస్‌ను ఇచ్చిన విశిష్ట పథకాల్లో ప్రధానమైనవి ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ! ఆ సత్సంప్రదాయాన్ని రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణలో కేసీఆర్, ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు ప్రభుత్వాలు కూడా ఎటువంటి భేషజాలకు పోకుండా కొనసాగించాయి.

ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం బకాయి పెట్టిన రెండేండ్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను సైతం కేసీఆర్ సర్కార్ క్లియర్ చేసింది. కేసీఆర్ మరో అడుగు ముందుకేసి, విదేశీ విద్యానిధి పథకం కింద అల్పాదాయ వర్గాల వారు సైతం విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు చేయూతనందించారు. రేవంత్‌రెడ్డి సర్కార్ కొలువుదీరిన తరువాత ఆయా పథకాలకు గ్రహణం పట్టిందని, నాలుగేండ్ల ఫీజుల బకాయిలు పేరుకొనిపోయాయని విద్యార్థులు, కాలేజీ యాజమాన్యాలు, విద్యార్థి సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. దాదాపు ఇరవై ఏండ్లపాటు ఎటువంటి ఒడిదుడుకులు లేకుండా సాఫీగా సాగిన ఈ పథకం అనేక ప్రయోజనాలు ఇచ్చింది. నిరుపేద కుటుంబాల నుంచి సైతం లక్షలాది మంది యువ ఇంజినీర్లు, వేలాది డాక్టర్లు తయారవ్వడానికి దోహదపడింది. హైదరాబాద్‌లో విస్తరిస్తున్న ఐటీ పరిశ్రమకు అవసరమైన వృత్తి నిపుణులను స్థానికంగానే అందించింది. తీవ్రవాద సంస్థల వైపు ఆకర్షితులు కాకుండా విద్యార్థులను నిరోధించింది. తద్వారా శాంతిభద్రతల పరిరక్షణకు పరోక్షంగా ఉపకరించింది. తమ బిడ్డల ఉన్నత చదువులకు అయ్యే వ్యయం తగ్గడం, ఆ మేరకు అధిక వడ్డీలకు అప్పులు చేయాల్సిన దురవస్థ తప్పడంతో రైతుల ఆత్మహత్యలు కూడా తగ్గుముఖం పట్టాయి.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ప్రాధాన్యత, లక్షలాది కుటుంబ ఆర్థిక వ్యవస్థల మీద, హైదరాబాద్ ఐటీ రంగానికి అవసరమైన నిపుణులను అందించడంలోనూ అది చూపిన ప్రభావం అర్థం కాలేదో ఏమో గానీ, దానిని నిర్లక్ష్యం చేస్తున్నారు. 'విద్యార్థుల చదువుల మీద పెట్టేది ఖర్చు కాదు..వారి భవిష్యత్తుతోపాటు రాష్ట్ర, దేశ భవిష్యత్తు కోసం చేస్తున్న ఇన్వెస్ట్‌మెంట్!' అనే స్ఫూహతో ప్రభుత్వాలు వ్యవహరించాలి. నిజానికి, ఇప్పుడు టెక్నాలజీ రంగం కొత్త పుంతలు తొక్కుతున్నది. ఇప్పటికే ఉద్యోగాలు చేస్తున్నవారు సైతం కొత్త టెక్నాలజీకి అనుగుణంగా తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాల్సిన దశ నడుస్తున్నది. ఇలాంటి సమయంలో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీలు జాబ్ మార్కెట్ డిమాండ్లకు అనుగుణంగా కొత్త టెక్నాలజీని అప్‌డేట్ చేసుకొంటూ, విద్యార్థుల నైపుణ్యాలకు మరింత మెరుగులు దిద్దాల్సిన ఆవశ్యకత ఏర్పడుతున్నది. నాలుగేండ్లపాటు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను బకాయిపెట్టి, ఇప్పటికైనా ఇస్తరో, లేదో, ఇస్తే గిస్తే ఎప్పుడిస్తరో, ఎంత ఇస్తరో తెలియని అయోమయ పరిస్థితులు ఉంటే ఆయా కాలేజీలు కొత్త టెక్నాలజీకి అప్‌డేట్ అవ్వడం సాధ్యమవుతుందా? విద్యార్థులు సైతం నైపుణ్య శిక్షణ మీద వంద శాతం దృష్టిని కేంద్రీకరించగలరా? విద్యార్థుల భవిష్యత్తు పట్ల బాధ్యత గల ప్రభుత్వాలు ఆలోచించాల్సింది.. వారి కోసం పెడుతున్న ఖర్చు ఎలా తగ్గించుకోవాల్నా? అని కాదు; ప్రపంచంతో పోటీ పడేందుకు మరింత నాణ్యమైన విద్యను ఎలా అందించాల్నా అని!

# దీక్షపై రెండు వైఖరులు

ప్రజాస్వామ్యంలో నిరాహార దీక్ష అనేది ఒక వ్యక్తి తన శరీరాన్ని ఆయుధంగా మార్చుకుని ప్రభుత్వాన్ని ప్రశ్నించే అత్యంత శాంతియుతమైన నిరసన రూపం. స్వాతంత్ర్య పోరాట కాలంలో గాంధీజీ దీనిని సత్యాగ్రహం పేరుతో ప్రాచుర్యంలోకి తెచ్చారు. ఆనాడు దేశ స్వాతంత్ర్య సాధనలో ఈ పోరాట రూపం కీలక పాత్ర పోషించడమే కాకుండా దేశదేశాల్లోని ప్రజలకు స్ఫూర్తిగా నిలిచింది. అధికార పీఠాలను కదిలించి ప్రజల ఆకాంక్షలను సాధించడంలో ఇప్పటికీ ఇదొక సర్వోన్నత ఆయుధంగానే కొనసాగుతున్నది. తెలంగాణ రాష్ట్ర సాధన స్వప్నాన్ని సాకారం చేసేందుకు కేసీఆర్ ఈ మార్గాన్నే ఎంచుకోవడం ఇటీవలి చరిత్ర. హక్కుల ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ ఢిల్లీలో చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష నేపథ్యంలో ఇదంతా గుర్తుకు రావడం సహజమే. విద్యారంగంలో చోటుచేసుకున్న అవకతవకలు, పరీక్షల నిర్వహణలో వైఫల్యాలు, విద్యార్థుల భవిష్యత్తుపై ఏర్పడిన అనిశ్చితికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని వాంగ్‌చుక్ డిమాండ్ చేస్తున్నారు. కానీ ఈ నిరసన పట్ల కేంద్ర ప్రభుత్వ స్పందన ఆశించినంత స్థాయిలో లేకపోవడం ప్రజాస్వామ్య వర్గాల్లో చర్చకు దారితీస్తున్నది. పైగా నిరాహార దీక్ష చేపట్టిన వ్యక్తిపై ఎన్నడూ లేని స్థాయిలో సామాజిక మాధ్యమాల్లో వ్యతిరేక ప్రచారం జరుగడం ఆందోళన కలిగిస్తున్నది. వాంగ్‌చుక్‌ను బలవంతంగా దీక్షాస్థలి నుంచి పోలీసుల సాయంతో దవాఖానకు తరలించారు. ఆందోళనకారులతో చర్చలు జరిపేందుకు కేంద్రం ఏమాత్రం సిద్ధంగా లేకపోవడం గమనార్హం. గాంధీజీ ఆశయాలు, ఆదర్శాల పట్ల ఏమాత్రం ఆసక్తి లేని పాలక వ్యవస్థ ఇప్పుడు దేశాన్ని ఏలుతుండటం అందుకు కారణమని అనుకోవాలా?



2011లో అన్నా హజారే చేపట్టిన అవినీతి వ్యతిరేక నిరాహార దీక్ష ఈ సందర్భంగా సహజంగానే మనకు గుర్తుకు వస్తుంది. అప్పట్లో యూపీఏ ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్న సమయంలో అన్నా హజారే ఢిల్లీలోని రామ్‌లీలా మైదానాన్ని ప్రజా ఉద్యమ కేంద్రంగా మార్చారు. జనలోక్‌పాల్ కోసం ఆయన చేసిన దీక్షకు దేశవ్యాప్తంగా అపూర్వ స్పందన లభించింది. అప్పటి ప్రతిపక్షమైన బీజేపీ ఆ ఉద్యమానికి పూర్తి మద్దతు పలుకడం గమనార్హం. అవినీతికి వ్యతిరేకంగా ప్రజల ఆగ్రహానికి ప్రభుత్వం తలవంచాలని, అన్ని డిమాండ్లను పరిగణనలోకి తీసుకోవాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. నాడు అన్నా దీక్ష ప్రజాస్వామ్యవాణి అయితే, నేడు వాంగ్‌చుక్ దీక్ష ఎందుకు అదే గౌరవాన్ని పొందడం లేదు అనే ప్రశ్న ఇప్పుడు ముందుకు వస్తున్నది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజాఉద్యమాలను ప్రజాస్వామ్య విజయంగా అభివర్ణించిన రాజకీయ పార్టీ, అధికారంలోకి వచ్చిన తర్వాత విమర్శలను ఎందుకు భిన్నంగా చూస్తున్నది? ప్రభుత్వం మారినప్పుడల్లా నిరసనల పట్ల వైఖరి మారిపోవడం భారత రాజకీయాల్లో కొత్త విషయం కాదు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్షాల నిరసనలను తక్కువ చేసిన సందర్భాలూ ఉన్నాయి. ఇది రాజకీయ నైతికతకు సంబంధించిన ప్రశ్న. అన్నాహజారే ఉద్యమ సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని 'ప్రజల గొంతు వినాలి' అని బీజేపీ వత్తిడి తెచ్చింది. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న మంత్రులు నైతిక బాధ్యత వహించాలని హితబోధ చేసింది. కానీ ఇప్పుడు అదే నైతిక ప్రమాణాన్ని కేంద్రంలోని తమ ప్రభుత్వానికి వర్తింపజేయడానికి సిద్ధంగా లేదనేది స్పష్టంగానే తెలిసిపోతున్నది. ఒక ప్రభుత్వ విభాగంపై తీవ్రమైన ఆరోపణలు వచ్చినప్పుడు, 'జవాబుదారీతనం ఎక్కడ?' అనే ప్రశ్నకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత సర్కార్‌పై ఉంటుంది. అధికారంలో ఉన్నవారు ప్రశ్నలను తప్పించుకోవడం కంటే, వాటిని ఎదుర్కొని ప్రజలకు నమ్మకం కలిగించడం ఎంతైనా అవసరం.

## లోకల్ బాడీ ఎన్నికల్లో జనసేన లొల్లి..

గుంటూరు

స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పోటీపై ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్ చేసిన వ్యాఖ్యలు కూటమిలో అగ్గి రాజేస్తున్నాయి. ముఖ్యంగా ఉమ్మడి తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో జనసేన, టీడీపీ నేతల మధ్య సీట్ల పంచాయతీకి దారితీసే అవకాశం ఉంది. అయితే టీడీపీ క్యాడర్ స్పందించి ఎలాంటి ప్రకటనలు చేయకుండా పార్టీ అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు ముందుగానే స్పందించి స్పష్టమైన ఆదేశాలిచ్చారు.రాబోయే ఏపీ స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమిలోని ఏ పార్టీ ఎన్నెన్ని స్థానాల్లో పోటీ చేస్తుందనే అంశంపై టీడీపీ నాయకులెవరూ బహిరంగంగా మాట్లాడవద్దని పార్టీ అధినేతల చంద్రబాబు క్యాడర్‌ను ఆదేశించారు. పార్టీ ముఖ్య నేతలతో చంద్రబాబు శనివారం రాత్రి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ, అనవసర చర్చలకు అవకాశం ఇచ్చేలా ఏ ఒక్కరూ వ్యవహరించవద్దని హెచ్చరించారు. కూటమి భాగస్వామ్య పార్టీలు టీడీపీ, జనసేన, బీజేపీల మధ్య విభేదాలు సృష్టించడానికి గొడ్డలి పార్టీ వైసీపీ కాచుకుని కూర్చుందని, ఈ విషయాన్ని టీడీపీ నేతలు గుర్తుంచుకోవాలని సూచించారు. ఎన్నికల కార్యాచరణను మరింత బలోపేతం చేసేందుకు ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నేతలతో వచ్చే నెల మొదటి లేదా రెండో వారంలో ప్రత్యేక వర్క్‌షాప్‌ను నిర్వహిస్తామని చంద్రబాబు వెల్లడించారు. స్థానిక సంస్థల ఎన్నికల సీట్ల సర్దుబాటు గురించి టీడీపీ నేతలు చర్చించవద్దని, పోటీ చేసే స్థానాలపై ఎలాంటి ప్రకటనలు చేయవద్దని చంద్రబాబు స్పష్టం చేశారు. ఆ అంశాన్ని కూటమి పార్టీల అగ్రనాయకత్వం సరైన సమయంలో చర్చించి నిర్ణయం తీసుకుంటుందన్నారు. పార్టీ నేతలు క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేస్తూ, ఎన్నికలకు పూర్తిస్థాయిలో సిద్ధం చేయడంపైనే ఫోకస్ చేయాలని సూచించారు. కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేసి అద్భుత ఫలితాలు సాధించేలా ముందుకు సాగాలని పార్టీ శ్రేణులకు చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలపై జనసేన నేత, మంత్రి నాదెండ్ల మనోహర్ ఇటీవల గుంటూరులో కీలక వ్యాఖ్యలు చేశారు. రాబోయే ఎన్నికల్లో జనసేనకు బలం ఉన్న ప్రతి చోటా తాము తప్పకుండా పోటీ చేస్తామని స్పష్టం చేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర ప్రయోజనాల కోసం, వైసీపీ వ్యతిరేక ఓటు చీలకూడదనే ఉద్దేశంతో అధినేత పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు జనసైనికులు వెనక్కి తగ్గారని గుర్తుచేశారు. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదని, క్షేత్రస్థాయిలో బలాబలాలు చూసుకుని సర్పంచ్ ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పోటీకి జన సైనికులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.ఆనాటి సార్వత్రిక ఎన్నికల ఫార్ములా స్థానిక ఎన్నికలకు వర్తించదని, ఈసారి సీట్ల విషయంలో తగ్గే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. పార్టీ కోసం మొదటి నుండి కష్టపడిన నాయకులకు, కార్యకర్తలకు పోటీ చేసేందుకు జనసేనలో తగిన ప్రాధాన్యత, అవకాశాలు కల్పిస్తామన్నారు. కూటమిలోని మిత్రపక్షాలతో తగిన సమన్వయం చేసుకుంటూనే, జనసేన శ్రేణులంతా ఎన్నికలకు సంపూర్ణంగా సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ ప్రకటనతో కూటమిలో సీట్ల సర్దుబాటుపై రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది.

# ఆర్టీసీ రాయితీ మాయాజాలం

జర్నలిస్టుల జేబులకు చిల్లు.. ! 1/3 రాయితీకి మంగళం.. సగం ధరకంటే ఎక్కువే వసూలు

ఎక్స్‌ప్రెస్‌లో 55శాతం, ఎలక్ట్రిక్ బస్సుల్లో 60శాతం బాదుడు

బస్సు పాస్‌లో ఒకటి.. టికెట్ మిషన్‌లో మరొకటి..!

సాఫ్ట్‌వేర్ సాకుతో అదనపు వసూళ్ల బెంబేలెత్తుతున్న విలేకరులు







**మన తొలివెలుగు, కుత్బుల్లాపూర్ ప్రతినిధి టి రమేష్ :**ప్రజా సమస్యల పరిష్కారం కోసం, సమాజ హితం కోసం అహర్నిశలు శ్రమించే జర్నలిస్టులకి ఆర్టీసీ షాక్ ఇస్తోంది. జర్నలిస్టులకు ఇచ్చే ప్రయాణ రాయితీల్లో నిశ్శబ్దంగా కోత విధిస్తూ, వారిపై అదనపు భారాలు మోపుతోంది. గతంలో అమలైన 1/3 (మూడో వంతు) రాయితీని కాగితాలకే పరిమితం చేస్తూ, క్షేత్రస్థాయిలో సగం కంటే ఎక్కువ ధరను వసూలు చేస్తుండటంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జర్నలిస్టులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్టేట్ అక్రిడిటేషన్ నిబంధనల ప్రకారం జర్నలిస్టులకు టికెట్ ధరలో కేవలం 33 నుండి 35 శాతం మాత్రమే వసూలు చేయాలి. కానీ, ప్రస్తుతం ఆర్టీసీ దాదాపు 50 శాతం (1/2 ధర) కంటే ఎక్కువే వసూలు చేస్తోంది. బస్సు పాస్‌ల మీద స్పష్టంగా 1/3 రాయితీ అని ముద్రిస్తున్న అధికారులు, టికెట్ ఇష్యూయింగ్ మిషన్లలో (టిమ్స్) మాత్రం ఆ మేరకు సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేయకపోవడమే ఈ దోపిడీకి కారణమని తెలుస్తోంది.

**ఎక్స్‌ప్రెస్, ఎలక్ట్రిక్ బస్సుల్లో చుక్కలు..!**

సాధారణ పల్లె వెలుగు బస్సుల కంటే ఎక్స్‌ప్రెస్, ఎలక్ట్రిక్ సర్వీసుల్లో జర్నలిస్టులకు రాయితీ భారం భారంగా మారింది. ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో వీటిలో జర్నలిస్టుల నుంచి ఏకంగా 53 శాతం నుండి 55 శాతం వరకు టికెట్ ధర వసూలు చేస్తున్నారు. అంటే రాయితీ 50 శాతం కూడా ఉండటం లేదు. ఎలక్ట్రిక్ బస్సుల్లో పర్యావరణ హితం పేరిట వచ్చిన ఈ బస్సుల్లో జర్నలిస్టులకు అసలైన షాక్ తగులుతోంది. ఇక్కడ ఏకంగా 60 శాతం ధర వసూలు చేస్తూ, కేవలం 40 శాతం రాయితీతోనే సరిపెడుతున్నారు.

**కండక్టర్లతో వాగ్వివాదాలు.. మిషన్లదే తప్పు..!**

బస్సుల్లో రాయితీపై కండక్టర్లను ప్రశ్నిస్తే.. మేమేం చేయలేం.. మిషన్లలో (టిమ్స్) ఫీడింగ్ ఎలా ఉంటే అలాగే టికెట్ వస్తుందని వారు చేతులెత్తేస్తున్నారు. రాయితీ లెక్కల్లో స్పష్టత లేకపోవడంతో నిరంతరం జర్నలిస్టులకు, కండక్టర్లకు మధ్య వాగ్వివాదాలు చోటు చేసుకుంటున్నాయి. దూరాన్ని బట్టి లెక్కించాల్సిన రాయితీలు అస్తవ్యస్తంగా మారుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల నుంచి వార్తల సేకరణ కోసం జిల్లా కేంద్రాలకు, ఇతర పట్టణాలకు నిరంతరం ప్రయాణించే విలేకరులకు ఈ టికెట్ భారం గుదిబండగా మారింది. అతి తక్కువ జీతాలతో పని చేసే జర్నలిస్టులు, తమ సంపాదనలో ఎక్కువ భాగం ప్రయాణాలకే వెచ్చించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఉచిత బస్ సౌకర్యం కల్పించాలి**
**టీడబ్ల్యూజేఎఫ్ డిమాండ్**

ఆర్టీసీ యాజమాన్యం తక్షణమే స్పందించిజర్నలిస్ట్ లందరికి ఉచిత బస్ సౌకర్యం అన్ని రకాల బస్సుల్లో కలిపించాలని (ఎక్స్‌ప్రెస్, ఎలక్ట్రిక్ సహా) టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేదా పాత పద్ధతిలో మూడోవంతు రాయితీని పక్కాగా అమలు చేయాలని జర్నలిస్టులు, జర్నలిస్టు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. యూజర్ చార్జీల నుంచి జర్నలిస్టులకు మినహాయింపు ఇవ్వాలని, టికెట్ మిషన్లలో సాఫ్ట్‌వేర్ లోపాలను సరిదిద్దాలని కోరుతున్నాయి. ప్రభుత్వ పెద్దలు స్పందించి ఈ రాయితీ కోతకు అడ్డుకట్ట వేయాలని జర్నలిస్టులు కోరుతున్నారు.

# ప్రతి అర్హుడైన పౌరుడి ఓటు హక్కు పరిరక్షించబడేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

బీ.ఎల్.ఏలు సమర్థవంతంగా పని చేయాలి

క్షేత్రస్థాయిలో ఆగస్టు 3 వరకు కష్టపడి పనిచేయాలి

**మన తొలివెలుగు, మహేశ్వరం ప్రతినిధి ముత్తయ్య ముదిరాజ్**

ప్రతి అర్హుడైన పౌరుడి ఓటు హక్కు పరిరక్షించబడేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలనీ టీపీసీసీ ఉపాధ్యక్షుడు, ఎస్ ఐ ఆర్ చేవెళ్ల పార్లమెంట్ ఇన్‌చార్జి సంగిశెట్టి జగదీశ్, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి తెలిపారు. వారు నియోజకవర్గం ఎస్ ఐ ఆర్ ఇన్ఛార్జి దేప భాస్కర్ రెడ్డి తో కలిసి తుక్కుగూడ కార్యాలయంలో మండల ఇన్ఛార్జులు, ఎస్ ఐ ఆర్, బి ఎల్ ఏ లు, అబ్జర్వర్స్ తో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. మహేశ్వరం నియోజకవర్గ ంలో ఓటరు ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి బూత్ స్థాయిలో సమర్థవంతంగా పనిచేయాలని మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో 17 మంది ఇన్‌చార్జీలు, 4 గురు అబ్జర్వర్స్ , బీ.ఎల్.ఏ లతో సమావేశంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు, ఎస్ ఐ ఆర్ చేవెళ్ల పార్లమెంట్ ఇన్‌చార్జి సంగిశెట్టి జగదీశ్వర్ సూచించారు. ఆగస్టు 3 వరకు క్షేత్రస్థాయిలో కష్టపడి పనిచేయాలని ముఖ్యమంత్రి సూచనలు చేశారని అనంతరం తెలిపారు. ఈ సందర్భంగా అబ్జర్వర్ జగదీష్ మాట్లాడుతూ ఇన్ఛార్జీలపై అబ్జర్వర్స్ ను పెట్టడం వల్ల ప్రతీ ఇంటికీ కాంగ్రెస్ పార్టీ నాయకత్వం వెళ్తుందని చెప్పారు. ప్రతీ ఇన్ఛార్జి, అబ్జర్వర్ కనీసం 25 ఇళ్లకు రోజూ వెళ్లేలా ప్లాన్ చేసుకోవాలని లక్ష్మారెడ్డి సూచించారు. రేపు, ఎల్లుండి బూత్ స్థాయి, ఇన్ఛార్జీలతో క్షేత్రస్థాయి పర్యటన చేయాలని కిచ్చెన్నగారు అబ్జర్వర్స్ కు చెప్పారు. సీఎం సూచనలను వివరించారు. నియోజవర్గం స్థాయిలో ఎస్ఐఆర్




అబ్జర్వర్స్ గా దేప భాస్కర్ రెడ్డి, అమరేందర్ రెడ్డి, పుట్టగళ్ల జగన్, బొక్క జంగారెడ్డిని నియమించారు. 17 మంది డివిజన్ అధ్యక్షులు, మరో 17 మంది అబ్జర్వర్స్, 540 మంది బూత్ స్థాయి బీ.ఎల్.ఏలతో ఓటర్ సమగ్ర సవరణ బాధ్యతలను సమన్వయం చేసుకోవాలని 98 మంది సర్ ఇన్ఛార్జీలకు కే.ఎల్.ఆర్ సూచించారు. ఆగస్టు 3 వరకు ఓటర్ సమగ్ర సవరణలోనే పని చేయాలని స్పష్టం చేశారు. ఎస్ ఐ ఆర్ తో తప్పుల తడకలు, దొంగ ఓట్లు లేకుండా చూడాలని కోరారు. మాట్లాడుతూ ఎస్.ఐ.ఆర్ ప్రక్రియలో ప్రతి అర్హులైన పౌరుడి ఓటు హక్కు పరిరక్షించబడేలా ప్రత్యేక శ్రద్ధ తీసు తీసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ తరపున బీఎల్ఏలు పూర్తి బాధ్యతతో వ్యవహరించి సహాయం అందించాలని తెలిపారు. ప్రజలకు సరైన సమాచారం చేరవేయడంతో పాటు వారి సందేహాలను నివృత్తి చేస్తూ ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండాలని బీఎల్ ఏలకు సూచించారు. అదేవిధంగా ఓటు ఉన్నప్పటికీ ఎవరైనా ఓటర్లు అందుబాటులో లేకపోతే, సంబంధిత బీఎల్ ఓలను తిరిగి వారి వద్దకు తీసుకెళ్లి, వారి ఓటు హక్కు పరిరక్షించబడేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఒక్క ఓటు కూడా పోకుండా చూడాలన్నారు. ఎస్ఐఆర్ సర్వే సందర్భంగా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించి, అర్హులైన ప్రతి ఓటరికి సహకారం అందించి ఒక్క ఓటు కూడా రద్దు కాకుండా చూడాలన్నారు. ఇన్ఛార్జీలపై అబ్జర్వర్స్ ను పెట్టడం వల్ల ప్రతీ ఇంటికీ కాంగ్రెస్ పార్టీ నాయకత్వం వెళ్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు భాస్కర్ రెడ్డి, సిద్దాల శ్రీశైలం, సామిడి గోపాల్ రెడ్డి, నెల్లికంటి ధనరాజ్ గౌడ్, పాండు రంగారెడ్డి, బాల్ లింగం జంగయ్య, షేక్ జహంగీర్, యూసఫ్ ఖాద్రి, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారుడిని ప్రభుత్వం ఆదుకోవాలి

**మన తొలివెలుగు, మోత్కూర్ ప్రతినిధి పబ్బు ప్రవీణ్ :** మలిదశ తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలను సైతం పణంగా పెట్టి పోరాడిన నిజమైన ఉద్యమకారులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని మోత్కూరు ప్రాంత తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దామరోజు వీరాచారి కోరారు. యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలం కొండపురం గ్రామానికి చెందిన పంజాల అయిలయ్య తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారని ఆయన తెలిపారు. ఉద్యమ సమయంలో ట్యాంక్ బండ్ పై మిలియన్ మార్చ్, వంటా–వార్పు, రైల్ రోకో వంటి అనేక కార్యక్రమాల్లో పాల్గొని, చెంచల్‌గూడ జైలులో 45 రోజుల పాటు శిక్ష అనుభవించారని గుర్తు చేశారు. తెలంగాణ వస్తే బతుకులు మారుతాయని నమ్మి పోరాడితే, స్వరాష్ట్రంలో ఎలాంటి లబ్ధి చేకూరక కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం జీవనోపాధి కోసం హైదరాబాద్ వెళ్లి ఒక సాధారణ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారని తెలిపారు. కుటుంబంలో అనారోగ్య సమస్యల కారణంగా



భార్యను కోల్పోవడంతో, ఇద్దరు ఆడపిల్లలతో ఆయన కుటుంబం అభాగ్యులుగా మారిందని పేర్కొన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా నిజమైన ఉద్యమకారులకు ఇంకా న్యాయం జరగడం లేదని విమర్శించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తమ మేనిఫెస్టోలో పెట్టిన హామీల ప్రకారం



GCP 630—6-11-07—30,000

CT/UT No. 7443 | CENTRAL PRISON, HYDERABAD PRISONER'S IDENTITY CARD | Age: 29Y | Date of admission 12/3/11

1 Name P. Ilaiah
2 Father's Name Mallaiah
3 Case No 68/2011
4 Section 147, 148, 332, 333, 427, 435 r/w 188 IPC 149 IPC
5 Police Station CCS P.D Hyd
6 Court XII ACMM Hyd
7 PPC & Valuable Property Rs 623
8 Address

Deputy Jailor | Jailor

తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవాలని, అయిలయ్య కుటుంబానికి తక్షణ సహాయం అందించాలని డిమాండ్ చేశారు. కాగా, ఉద్యమకారుల ఫోరం తరఫున అయిలయ్య కుటుంబానికి తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని వీరాచారి హామీ ఇచ్చారు.

## నిరసనకారులపై లాఠీచార్జీ దుర్మార్గం



**మన తొలివెలుగు, ?ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో ప్రతినిధి ఎన్. హరీష్ :** ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న పర్యావరణ ఉద్యమకారుడు సోనం వాంగ్‌చుగ్‌పై పోలీసులు లాఠీచార్జీ చేయడాన్ని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కమిటీ ఖండించింది. సోమవారం వనపర్తి జిల్లా కేంద్రంలో నిర్వహించిన నిరసనలో పార్టీ జిల్లా కార్యదర్శి సి. హనుమంతు మాట్లాడుతూ.. లడఖ్ పరిరక్షణ, నిరుద్యోగ సమస్యలపై ప్రశ్నిస్తున్న వారిపై కేంద్రం నిర్బంధం ప్రయోగించడం దుర్మార్గమన్నారు. పేపర్ లీకేజీలకు బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రసాద్, గణేష్, రాజన్న, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

## సూరారం సీఐగా బాధ్యతలు స్వీకరించిన కే. బాలరాజు కి ఘన సన్మానం



**మన తొలివెలుగు, కుత్బుల్లాపూర్ ప్రతినిధి టీ. రమేష్ :**సూరారం పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ)గా బాధ్యతలు చేపట్టిన బాలరాజుని గాజుల రామారం డివిషన్ మాజీ కార్పొరేటర్ రావుల శేషగిరి , బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి నల్ల జై శంకర్ గౌడ్, మేడ్చల్ జిల్లా కౌన్సిల్ సభ్యుడు పులి బలరాం, శ్రీరాములు, మాధవులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కే. బాలరాజు గతంలో జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌లో సీఐగా విధులు నిర్వహించిన సమయంలో, ముఖ్యంగా కరోనా మహమ్మారి క్లిష్ట పరిస్థితుల్లో ప్రజలకు అండగా నిలిచి శాంతి భద్రతలను సమర్థవంతంగా పరిరక్షించారని కొనియాడారు. ప్రజల సమస్యలను ఓర్పుతో విని, నిష్పాక్షికంగా పరిష్కరించే అధికారిగా మంచి గుర్తింపు పొందారని పేర్కొన్నారు. మళ్లీ సూరారం పోలీస్ స్టేషన్ సీఐగా బాధ్యతలు చేపట్టడం స్థానిక ప్రజలకు ఆనందదాయకమని తెలిపారు. ఆయన నాయకత్వంలో సూరారం పరిధిలో శాంతి భద్రతలు మరింత బలోపేతం కావడంతో పాటు ప్రజలకు సత్వర న్యాయం, మెరుగైన పోలీసు సేవలు అందుతాయనే పూర్తి విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కే. బాలరాజుకి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజలకు ఇదే సేవాభావంతో న్యాయం చేయాలని ఆకాంక్షించారు.

## ప్రతి ఓటు ప్రజాస్వామ్యానికి బలం. ప్రతి ఓటరిని కాపాడటం మన బాధ్యత.



**మన తొలివెలుగు, మహేశ్వరం ప్రతినిధి ముత్తయ్య ముదిరాజ్** ప్రతి ఓటు ప్రజాస్వామ్యానికి బలం ప్రతి ఓటరిని కాపాడటం మన బాధ్యత అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. సొంత గ్రామం కౌకుంట్లలో ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రా రెడ్డి , తనయుడు పట్లోళ్ల కార్తీక్ రెడ్డి, కుటుంబ సభ్యులతో కలిసి ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాన్ని నింపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు అమూల్యమైనది. గడువు ముగిసేలోపు ప్రతి అర్హ ఓటరు తమ ఎన్యూమరేషన్ ఫారాన్ని నింపి సంబంధిత ఎన్నికల అధికారులకు అందజేయాలని విజ్ఞప్తి చేశారు. ఎస్. ఐ .ఆర్ ఎన్యూమరేషన్ ప్రక్రియ చివరి దశకు చేరుకున్న నేపథ్యంలో అర్హులైన ఒక్క ఓటు కూడా కోల్పోకుండా బీఆర్ఎస్ నాయకులు, బూత్ లెవెల్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండి ప్రతి ఇంటికి చేరి ప్రజలకు సహాయం అందించాలని పిలుపునిచ్చారు.

## ఫిర్యాదులపై వెంటనే చర్యలు చేపట్టాలి

ఎస్పీ సునితా రెడ్డి



**మన తొలివెలుగు, ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో ప్రతినిధి ఎన్. హరీష్ :** ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యానికి తావులేకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె బాధితుల నుంచి నేరుగా ఫిర్యాదులను స్వీకరించారు. ?ఈ సందర్భంగా భూ వివాదాలకు సంబంధించి 5, భార్యాభర్తల గొడవలకు సంబంధించి 3, పరస్పర గొడవలపై 9, మొత్తం 17 ఫిర్యాదులు అందాయి. ఎస్పీ ఆయా స్టేషన్ల అధికారులతో ఫోన్లో మాట్లాడి, బాధితులకు సత్వర న్యాయం అందించాలని, ప్రజావాణి అర్జీలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు.

# ఆధిపత్య పోరులో.. ఆగమవుతున్న మోత్కూర్ మున్సిపాలిటీ..

**రూ. 15 కోట్ల నిధులకు బహిరంగ టెండర్లు వేయాలి**
**15 రోజుల్లో రాజన్నగూడెం రోడ్డు పూర్తి చేయాలి**
**కొణతం యాకుబ్ రెడ్డి డిమాండ్**





**మన తొలివెలుగు, మోత్కూర్ ప్రతినిధి పబ్బు ప్రవీణ్ :** మోత్కూర్ మున్సిపాలిటీ పరిధిలో సాగుతున్న అంతర్గత ఆధిపత్య పోరు వల్ల స్థానిక అభివృద్ధి పూర్తిగా కుంటుపడుతోందని యాదాద్రి భువనగిరి జిల్లా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొణతం యాకుబ్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నియోజకవర్గ అభివృద్ధికి కేటాయించిన రూ.15 కోట్ల నిధుల పంపకాల వ్యవహారంలో స్థానిక శాసనసభ్యుడి హస్తం మరోసారి బహిర్గతమైందని ఆయన ఆరోపించారు. సోమవారం మోత్కూర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మున్సిపల్ అభివృద్ధిపై స్థానిక ప్రజాప్రతినిధుల వైఖరిని ఎండగట్టారు. ఈ సందర్భంగా కొణతం యాకుబ్ రెడ్డి మాట్లాడుతూ.. కొత్తగా పైసలు ఎలాగూ తీసుకురావడం లేదు, కనీసం మంజూరై వచ్చిన నిధులనైనా ఖర్చు చేయడానికి వచ్చిన ఇబ్బంది ఏమిటి..? అని ప్రశ్నించారు. ఎమ్మెల్యేకు ఈ ప్రాంతంపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే, ఇక్కడి ప్రజల ఇబ్బందులను తొలగించాలన్న ఆరాటం ఉంటే వెంటనే రూ.15 కోట్ల నిధులకు బహిరంగ టెండర్లు వేయించి పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. పేరుకే ఎమ్మెల్యే పదవిలో ఉన్నారని, కానీ అసలు పవర్ అంతా ఆయన కొడుకుల చేతుల్లోనే నడుస్తోందని, ఎమ్మెల్యే కుమారులు కమిషన్ల కోసం మున్సిపాలిటీలో పనులన్నీ అర్ధాంతరంగా నిలిచిపోతున్నాయని, కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీపై, వారి నాయకులపై విమర్శలు చేయడానికి చూపిస్తున్న శ్రద్ధను.. స్థానిక సమస్యల పరిష్కారంపై, నిలిచిపోయిన పనులపై చూపించడం లేదని అన్నారు.

**15 రోజుల్లో రాజన్నగూడెం రోడ్డు పూర్తి చేయాలి**

ఎమ్మెల్యేకు ఈ ప్రాంతంపై నిజమైన ప్రేముంటే, మంజూరైన రూ. 15 కోట్ల నిధులు లాప్స్ (వెనక్కి) కాకుండా చూడాలని హితవు పలికారు. తక్షణమే పారదర్శకంగా బహిరంగ టెండర్లు నిర్వహించి మోత్కూరును అభివృద్ధి పథంలో నడిపించాలని కోరారు. ముఖ్యంగా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న రాజన్నగూడెం రోడ్డు నిర్మాణాన్ని రాబోయే 15 రోజుల్లోగా పూర్తి చేయాలని ఆయన గడువు విధిస్తూ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజల పక్షాన పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మండల బీసీ నాయకులు పానుగుల్ల విష్ణు, మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి గజ్జి మల్లేష్, కూరెళ్ల పరమేష్, కూరెళ్ల రమేష్, బందెల శ్రీను తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దేశ పౌరులు అందరూ ఓటర్లు గా నమోదు కావాలి



**మన తొలివెలుగు, మహేశ్వరం ప్రతినిధి ముత్తయ్య ముదిరాజ్ :** బీజేపీ అగ్రనేత మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయని మర్యాద పూర్వకంగా బీజేపీ రాష్ట్ర కో ఆపరేటివ్ సెల్ కన్వీనర్ కొలన్ శంకర్ రెడ్డి కలిసి ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ.. భారత ఎన్నికల కమిషన్ చేపట్టిన సర్ ప్రక్రియలో ప్రతి ఓటరు భాగస్వాములు అయ్యే విధంగా చూడాలని, సమాజ సేవకులు చురుకుగా పాల్గొని నిజమైన దేశ పౌరులు అందరూ ఓటర్లు గా నమోదు అయ్యే విధంగా చూడాలని బీజేపీ రాష్ట్ర నేత కోలన్ శంకర్ రెడ్డిని కోరారు, ఎన్నికల కమిషన్ నిర్ణయం దేశ ప్రజలకు, అన్ని రాజకీయ పార్టీలకు మంచిదే అన్నారు. ఇది దేశానికి ఎంతో క్షేమ దాయకం అన్నారు, ఇందులో ప్రతి దేశ భక్తుడు పాల్గొనాలన్నారు. అనంతరం కొలన్ శంకర్ రెడ్డి మాట్లాడుతూ.. ఇచ్చిన ఎన్యూమరేషన్ ఫారాలను తమ వద్ద ఉంచుకోకుండా అవసరమైన ఆధారాలతో పాటు సంబంధిత అధికారులకు సమర్పించాలని సూచించారు. ఎన్యూమరేషన్ ఫారం నింపి తిరిగి ఇవ్వకపోతే ఓటు హక్కు కోల్పోతారన్నారు. ఎస్.ఐ.ఆర్ ప్రక్రియపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రతి ఓటరు తన పూర్తి వివరాలను నమోదు చేసి గడువులోగా ఫారాలు అందించాలని అర్హులైన ఓటర్లను కోరారు.

## అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు సీసీ రోడ్ల పనులు ప్రారంభించాలి

**సీపీఎం పార్టీ మండల కార్యవర్గ సభ్యుడు ఆలంపల్లి జంగయ్య**



**మన తొలివెలుగు, ఇబ్రహీంపట్నం ప్రతినిధి సీ.హెచ్ రాజు :** యాచారం మండలం పరిధిలో చింతపట్ల గ్రామంలో సోమవారం సీపీఎం పార్టీ నాయకులు చింతపట్ల గ్రామాల్లో పర్యటించి ప్రజలను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మండల కార్యవర్గ సభ్యులు ఆలంపల్లి జంగయ్య మాట్లాడుతూ.. 9, 10 వార్డులలో గత 25 సంవత్సరాల క్రితం నిర్మించిన మోరీలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో ఈగలు, దోమలు చేరి దుర్వాసన రావడం వల్ల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారుని అన్నారు. ప్రస్తుతం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన నేటికీ పనులు ప్రారంభించలేదని అన్నారు తక్షణమే సంబంధిత అధికారులు కాంట్రాక్టర్లు స్పందించి పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా 6వ వార్డ్ లో సీసీ రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కోసం గత ఏడాది జూన్ లో రూ. 5 లక్షలు నిధులు మంజూరై, ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి శంకుస్థాపన చేసినా.. నేటికీ పనులు ప్రారంభించలేదన్నారు. తక్షణమే అధికారులు స్పందించి పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. పదో వార్డులో ఉన్న బోర్ లో మోటర్ బిగించి నీటి సమస్య పరిష్కరించాలని స్థానిక గ్రామ సర్పంచ్, కార్యదర్శి స్పందించి నీటి సమస్య లేకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖా కార్యదర్శులు సీ.హెచ్ సత్యం, కే. గిరికాంత్, గ్రామ ఉపసర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, పదవ వార్డ్ సభ్యులు మస్కు శివలీల, గణేష్, ఎం రమేష్ , ప్రభాకర్ , రమేష్ , యాదగిరి, శేఖర్, శ్రీను, రమేష్, నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

## సర్ ప్రక్రియ వేగవంతం చేయాలి

**ఎమ్మెల్యే యెన్నం**



**మన తొలివెలుగు,ఉమ్మడి ?మహబూబ్ నగర్ బ్యూరో ప్రతినిధి ఎన్. హరీష్ :**నగరంలో ప్రత్యేక ఓటరు సవరణ సర్ ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రభుత్వ విప్, మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కార్పొరేటర్లతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కార్పొరేటర్లందరూ తమ పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి, ప్రజలతో సర్ ఫారాలను నింపించడంలో భాగస్వాములు కావాలని సూచించారు. ఓటర్ల జాబితా సవరణపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందన్నారు.

## సిఎస్సి హెల్త్ టెస్టులను రద్దు చేయాలి



**మన తొలివెలుగు, భువనగిరి రూరల్ ప్రతినిధి కొండమడుగు నాగమణి:** సీఎస్సీ హెల్త్ టెస్టులను రద్దు చేయాలని, అదేవిధంగా డెత్ క్లెయిమ్స్ ను ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వొద్దని, జీవో నెంబర్ 12 ను రద్దుచేసి డెత్ క్లెయిమ్స్ ను లేబర్ డిపార్ట్మెంట్ ద్వారానే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ ముందు జరిగిన భవన నిర్మాణ కార్మికుల ధర్నాలో పాల్గొన్న సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి, బీసీడబ్ల్యూయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గొరిగె సోములు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత భవన నిర్మాణ కార్మికులకు సంబంధించిన సంక్షేమ బోర్డు నిధులను సీఎస్సీ టెస్ట్ ల ద్వారా ఒక్కో కార్మికుడి పేరు మీద డబ్బులు కేటాయిస్తూ ప్రైవేటు ఏజెన్సీలకు అప్పజెప్పడంతో కార్మికుల కష్టార్జితం అయిన అట్టి బోర్డు డబ్బులను దుబారా ఖర్చు చేస్తుందని అన్నారు. తన అనుయాయులకు అందిస్తుందని, కార్మికులకు ఎలాంటి ఉపయోగం లేదని, అందుకే తక్షణమే సీఎస్సీ టెస్ట్ లను రద్దు చేయాలని అన్నారు. డెత్ క్లెయిమ్స్ ను కూడా ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇచ్చేందుకు తెచ్చిన జీవో నెం. 12 ను రద్దు చేసి, లేబర్ డిపార్ట్మెంట్ ద్వారానే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్ లో ఉన్న క్లైమ్సుకు వెంటనే నిధులు విడుదల చేయాలని అన్నారు. కార్మికులకు సంక్షేమ పథకాలు అందించేకాడ లేబర్ డిపార్ట్మెంట్లో జరుగుతున్న జాప్యాన్ని వెంటనే తగ్గించాలని కోరారు. 55 సంవత్సరాలు పైబడిన నిర్మాణ కార్మికులకు ఒక్కొక్కరికి రూ. 6 వేల పెన్షన్ గ్యారెంటీ చేయాలన్నారు. పిల్లల చదువుల నిమిత్తం స్కాలర్షిప్ లను బోర్డు ద్వారా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అర్హులైన భవన నిర్మాణ కార్మికులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరారు. పనిముట్లు కొనుక్కునేందుకు బోర్డు ద్వారా రుణ సదుపాయం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు, సంఘం గౌరవ అధ్యక్షులు దాసరి పాండు, జిల్లా ఉపాధ్యక్షులు మాయ కృష్ణ, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చీమకండ్ల శ్రీరాములు, నాయకులు పోతరాజు జహంగీర్, గంధంమల్ల మాతయ్య, వంగాల మారయ్య, గాదె కృష్ణ, ఎస్. కే శీను, బందెల ఈశ్వర్, సాయిలు, డి వెంకన్న, బుడ్డ ప్రసాద్, జుంపాల మహేష్, లింగస్వామి, మొగిలి కృష్ణ, జె పరమేష్, బి. ఆంజనేయులు, నూనె అంజయ్య, జి కృష్ణ, బి పాండు, జి కొమురెల్లి, స్వామి, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## వరి తగ్గించి తోటపంటలు వేయండి




**మన తొలివెలుగు, ఉమ్మడి ?మహబూబ్‌నగర్ బ్యూ ప్రతినిధి ఎన్. హరీష్ :** ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తగ్గే ముప్పున్నందున రైతులు వరి సాగు తగ్గించి, ప్రత్యామ్నాయంగా తోటపంటలు వేయాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి సూచించారు. సోమవారం మహబూబ్‌నగర్‌లో మంత్రి దామోదర రాజనర్సింహతో కలిసి ఆయన ఎల్ నినోపై సమీక్షించారు. నీటి కొరత దృష్ట్యా రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించాలని, ఉపాధి హామీ కింద అదనపు పనులు కల్పించాలని, పశుగ్రాసం కొరత రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. రైతులు తప్పనిసరిగా పంట బీమా చేసుకోవాలన్నారు.

## ఇందిరమ్మ ఇంటి నిర్మాణ వివాదం

**ఎస్పీ, హౌసింగ్ పీడీకి లబ్ధిదారురాలి ఫిర్యాదు**
**కలెక్టరేట్ గ్రీవెన్స్ డేలో న్యాయం చేయాలని వినతిపత్రం సమర్పణ**

**మన తొలివెలుగు, మోత్కూర్ ప్రతినిధి పబ్బు ప్రవీణ్ :** మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలో ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకోనియ్యకుండా అడ్డుకుంటూ బెదిరింపులకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారు అవిశెట్టి విజయ సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ డేలో యాదాద్రి హౌసింగ్ పీడీ అలివేలుకు, ఎస్పీ ఆకాంక్ష యాదవ్ కు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. మున్సిపాలిటీకి చెందిన పల్లపు సమ్మయ్యతో ఇందిరమ్మ ఇల్లు కట్టడానికి ఒప్పందం చేసుకోగా రూ.6.10 లక్షలు తీసుకుని మధ్యలోనే వదిలేసి పోయాడని, మూడు నెలలుగా పని చేయకుండా ఇప్పుడు తాను వేరే పనివాళ్లతో మాట్లాడుకుని పని చేయించు కుంటుండగా ఇప్పుడు సమ్మయ్యతో పాటు ఆయన కొడుకు, మరో ఇద్దరు వ్యక్తులు, ఓ మేస్త్రి తన ఇంటికి వచ్చి బెదిరిస్తున్నారని, పనివాళ్లను ఇంటి పని చేస్తే ఊళ్లో ఉండనివ్వమని హెచ్చరిస్తున్నారని తెలిపారు. వారి బెదిరింపులపై తాను మొదటగా మోత్కూర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశానని, తన ఫిర్యాదును పక్కనపెట్టి కౌంటర్ ఫిర్యాదు చేసిన సమ్మయ్య ఫిర్యాదుతో మోత్కూరు సీఐ ఏఎస్ఐ శ్రీనివాస్ ను తన ఇంటికి పంపి ఇంటి పనులు ఆపాలని చెప్తున్నారని, తన భర్తను పోలీస్ స్టేషన్ కు రమ్మంటున్నారని, పోలీసులు కూడా సమ్మయ్యతో చేతులు కలిపి తాను ఇల్లు నిర్మించుకోకుండా అడ్డుపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. ఇందిరమ్మ ఇంటి నిర్మాణం అడ్డుకునే అధికారం పోలీసులకు లేదని ఇంటి నిర్మాణం ఎవరు అడ్డుకుంటున్నారో తెలుసుకొని రిపోర్టు చేయాలని హౌసింగ్ పీడీ మోత్కూర్ ఏఈని ఆదేశించినట్టు తెలిపారు. చౌటుప్పల్ డీసీపీకి చెప్పి తగిన చర్యలు తీసుకుంటానని ఎస్పీ హామీ ఇచ్చారని చెప్పారు.

## ఆలయ భూములను స్వాధీనం చేసుకోండి

**సీపీఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్**



**మన తొలివెలుగు, కుత్బుల్లాపూర్ ప్రతినిధి టీ. రమేష్ :** హైకోర్టు ఆదేశాల ప్రకారం జగద్గిరిగుట్ట శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయం పరిధిలోకి వచ్చే ప్రభుత్వ స్థలాన్ని సుమారు 14 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకోవలనీ హై కోర్ట్ ఇచ్చిన తీర్పును అమలు చెయ్యాలని కోరుతూ సోమవారం ప్రజవాణి లో మేడ్చల్ జిల్లా కలెక్టర్ కి వినతిపత్రం ఇవ్వడం జరిగిందని సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ తెలిపారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ.. మే నెలలో హై కోర్టు తీర్పునిస్తే ఇప్పటివరకు ఎలాంటి చర్యలకు పునుకోలేదని, దాని వల్ల మిగితా భూమి కూడా కబ్జాకు గురయ్యే ప్రమాదం ఉందని, కావున వెంటనే హై కోర్టు ఇచ్చిన తీర్పుని అనుసరించి భూమిని స్వాధీనం చేసుకోవలనీ కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర నాయకులు ఏసురత్నం, జిల్లా కార్యవర్గ సభ్యులు శంకర్, కౌన్సిల్ సభ్యులు శ్రీనివాస్, బాబు, సదానందం తదితరులు పాల్గొన్నారు.

## నులిపురుగుల సమస్యకు ఆల్బెండజోల్ మాత్రలు దోహదం



**మన తొలివెలుగు, మహేశ్వరం ప్రతినిధి ముత్తయ్య ముదిరాజ్ :** ఒకటి నుండి 19 ఏళ్ల లోపు పిల్లలల్లో నులిపురుగుల సమస్య నివారణకు, ఆహార జీర్ణక్రియ మెరుగుదలకు, శారీరక వికాసానికి ఆల్బెండజోల్ మాత్రలు ఉపయోగపడతాయని కల్వకోలు గ్రామ సర్పంచ్ బక్కని లక్ష్మమ్మ అన్నారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం కల్వకోల్ గ్రామంలో ప్రైమరీ స్కూల్ ను సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు చాలా తక్కువగా ఉన్నారని విద్యార్థుల సంఖ్యను పెంచే విధంగా ఉపాధ్యాయులు ప్రయత్నించాలని తెలిపారు. బాత్రూమ్స్, కిచెన్ సరిగా లేదని తెలిపారు. నీటి సౌకర్యం లేదని ఉపాధ్యాయులు తెలపడంతో దీనిపై స్పందించిన సర్పంచ్ సంబంధించిన డిపార్ట్మెంట్ తో మాట్లాడి పరిష్కారం అయ్యే విధంగా ప్రయత్నిస్తామని తెలిపారు. అనంతరం గ్రామ సర్పంచ్, ఆశా వర్కర్ మమతతో కలిసి ప్రైమరీ స్కూల్లో విద్యార్థులు ఆరోగ్యంగా ఉండడానికి ప్రభుత్వం అందజేసిన ఆల్బెండజోల్ టాబ్లెట్లను సర్పంచ్ విద్యార్థులకు వేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. నులిపురుగులు పిల్లల ఆరోగ్యానికి ముప్పుగా మారతాయన్నారు. టాబ్లెట్ వేసుకోవడంతో రక్త హీనత, పోషకాహార లోపం వంటి సమస్యలు తగ్గుతాయన్నారు విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం పరిశీలించి వారితో కలిసి భోజనం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో విలేజ్ సెక్రటరీ వేణు,ఆశా వర్కర్ మమత, ఉపాధ్యాయులు, ఆయమ్మ, నాయకుడు బక్కని రవి మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# సర్ తో ప్రజాస్వామ్యం పై దాడి

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి


అదనపు కలెక్టర్ వెంక రెడ్డి






**మన తొలివెలుగు, భువనగిరి రూరల్ ప్రతినిధి కొండమడుగు నాగమణి :** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి , డిఆర్వో జయమ్మ తో కలిసి వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 92 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. ప్రజావాణిలో ప్రజలు అందజేసిన అర్జీలలో రెవిన్యూ శాఖ 56, సర్వే ల్యాండ్స్ 9, గ్రామీణ అభివృద్ధి 6, మున్సిపాలిటీ 4, సంక్షేమ శాఖ 3, పంచాయతీ 3, డీసీఓ 2, ఇరిగేషన్ 2, వైద్య ఆరోగ్య శాఖ 2, ఎస్సీ కార్పొరేషన్ , ఎస్సీ డెవలప్మెంట్, ఆర్ అండ్ బి, ఉపాధి కల్పన, జిల్లా పరిషత్ శాఖలకు ఒక్కటి చొప్పున వచ్చాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్లు సాత్విక్, హౌసింగ్ పీడీ అలివేలు, ఆర్టీవో కృష్ణారెడ్డి , వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## భువనగిరి లో ఎస్సీ బాలికల వసతి గృహ భవనం నిర్మించాలని కలెక్టర్ కు వినతి



**మన తొలివెలుగు, భువనగిరి రూరల్ ప్రతినిధి కొండమడుగు నాగమణి :** భువనగిరి పట్టణంలోని ఖాజీమహళ్ళ లో ఎస్సీ బాలికల వసతి గృహం కొరకు నూతన భవనాన్ని వెంటనే నిర్మించాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక నాయకులు కొడారి వెంకటేష్ సోమవారం కలెక్టరేట్ లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ (ట్రైనీ) కృతిక కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కొడారి వెంకటేష్ మాట్లాడుతూ.. భువనగిరి పట్టణంలో సర్వే నెంబర్ 6 లో సుమారు ఒక ఎకరం విస్తీర్ణంలో గతంలో ఎస్సీ బాలికల వసతి గృహం ఉండేదని, అది శిథిలావస్థకు చేరుకోవడంతో భవనం నిరుపయోగంగా ఉందని ఆయన అన్నారు. సుమారు 500 మంది బాలికలు ఉండేందుకు అనువుగా ఉన్న భవనం స్థలాన్ని కొందరు కబ్జా దారులు కబ్జా చేయడానికి ప్రయత్నం చేస్తున్నారని ఆయన తెలిపారు. ప్రభుత్వం వెంటనే అట్టి స్థలంలో ఎస్సీ బాలికలకు వసతి గృహం నిర్మాణం చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఎస్సీ బాలికల వసతి గృహం అద్దె భవనంలో కొనసాగుతుందని, ప్రభుత్వం అద్దె రూపంలో నెలకు యాభై వేల రూపాయల చెల్లిస్తుందని ఆయన అన్నారు. జిల్లా కలెక్టర్ చొరవ తీసుకుని నూతన భవన నిర్మాణానికి కృషి చేయాలని వెంకటేష్ కోరారు.

## రైల్వే నోటీసులతో రోడ్డున పడ్డాం

**ఇల్లు కోల్పోతున్న బాధితులకు న్యాయం చేయాలి**

**ఆర్డీఓ కు వినతిపత్రం అందజేసిన నిర్వాసితులు**



**మన తొలివెలుగు, భువనగిరి రూరల్ ప్రతినిధి కొండమడుగు నాగమణి :**యాదాద్రి భువనగిరి జిల్లా రాయగిరి రైల్వే స్టేషన్ సమీపంలో ఇళ్లు కోల్పోతున్న భూబాధితులు, నిర్వాసితులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. తాము వందల సంవత్సరాలుగా అక్కడే నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నామని, ప్రభుత్వానికి సంబంధించిన పన్నులు, ఇతర ట్యాక్స్‌లు కూడా చెల్లిస్తున్నామని తెలిపారు. అయినప్పటికీ రైల్వే అధికారులు నోటీసులు జారీ చేసి ఇళ్లు ఖాళీ చేయాలని ఆదేశించడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్లు కోల్పోతున్న ప్రతి కుటుంబానికి న్యాయమైన నష్టపరిహారం అందించడం ప్రభుత్వం నిర్మించే ఇళ్లతో పాటు ఇంటి స్థలాలను కూడా కేటాయించాలని డిమాండ్ చేశారు. బాధితులందరికీ పూర్తి స్థాయిలో న్యాయం జరిగే వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు.





**2029 ఎన్నికలే లక్ష్యంగా బీజేపీ ఎస్ఐఆర్ ప్రయోగం**

**సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బి.వి రాఘవులు**

**మన తొలివెలుగు భువనగిరి రూరల్ ప్రతినిధి కొండమడుగు నాగమణి :** ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్)ను ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే ప్రక్రియగా కాకుండా, రాబోయే ఎన్నికల్లో రాజకీయ ప్రయోజనాలు పొందేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వినియోగించుకుంటోందని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బీ.వీ రాఘవులు ఆరోపించారు . అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కును పరిరక్షించాల్సిన ప్రజాస్వామ్య ఎన్నికల ప్రక్రియను బీజేపీ వ్యతిరేక ఓట్లను తొలగించే రాజకీయ ప్రయత్నాల కోసం సర్ నీ దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. సీపీఎం ఆధ్వర్యంలో చౌటుప్పల్‌లోని పద్మావతి ఫంక్షన్ హాల్‌లో సోమవారం నిర్వహించిన ప్రాంతీయ సదస్సులో ముఖ్య వక్తగా పాల్గొన్న రాఘవులు, ఎస్ఐఆర్‌పై విస్తృతంగా మాట్లాడారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ రాజ్యాంగబద్ధమైన ప్రక్రియేనని, అయితే గతంలో జరిగినప్పుడు ఇంత తీవ్ర రాజకీయ చర్చలు, ప్రజల్లో ఆందోళనలు కనిపించలేదని రాఘవులు అన్నారు. తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాల్లో చివరిసారిగా 2002లో సమగ్ర సవరణ జరిగిందని, పదేళ్లకోసారి జరగాల్సిన ప్రక్రియ ఆలస్యంగా ఇప్పుడు చేపట్టడం వెనుక రాజకీయ ఉద్దేశాలు ఉన్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రతి ఏడాది కొత్త ఓటర్ల నమోదుతో పాటు ఎన్నికల సమయంలో ప్రత్యేక నమోదు కార్యక్రమాలు నిర్వహించడం ఎన్నికల సంఘం సాధారణ విధానమే అయినప్పటికీ, ఈసారి ఎస్ఐఆర్‌పై అన్ని రాజకీయ పార్టీలు అప్రమత్తం కావడం పరిస్థితి తీవ్రతను సూచిస్తోందన్నారు.

**ప్రజాస్వామ్య బలోపేతం కాదు.. రాజకీయ ప్రయోజనాల కోసమే**

ఎస్ఐఆర్ ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం లక్ష్యమైతే.. తమ పార్టీ కూడా పూర్తిగా మద్దతు ఇస్తుందని రాఘవులు స్పష్టం చేశారు. అయితే ప్రస్తుతం చేపడుతున్న ప్రక్రియ వెనుక ప్రజాస్వామ్య పరిరక్షణ కంటే 2029 ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రాజకీయ లాభం పొందాలనే ఉద్దేశం ఉందని ఆరోపించారు. దేశంలో ధరల పెరుగుదల, రైతుల సమస్యలు, నిరుద్యోగం, యువతలో అసంతృప్తి వంటి కారణాలతో ప్రజల్లో ప్రభుత్వ వ్యతిరేకత పెరుగుతోందని పేర్కొంటూ, ఎన్నికల్లో ప్రజాభిప్రాయంతో గెలవడం కష్టమవుతుందనే అంచనాతోనే ఓటర్ల జాబితాలను ప్రభావితం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు.

**బీజేపీ కి పడని ఓట్లు లక్ష్యంగా**

ఎస్ఐఆర్ ప్రక్రియలో ముస్లింలు, ఇతర మైనారిటీలు, దళితులు, గిరిజనులు, వలస కార్మికులు, అసంఘటిత రంగ కార్మికులు, పేద వర్గాలు, కొన్ని వెనుకబడిన వర్గాలలో పడని ఓట్లు లక్ష్యంగా సఆర్ నీ కేంద్రం ఉపయోగించుకుందని రాఘవులు విమర్శించారు. గత ఎన్నికల్లో బీజేపీకి వ్యతిరేకంగా ఓటు వేసిన వర్గాలపై ప్రత్యేక దృష్టి పెట్టి వారి ఓటు హక్కును లేకుండా చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని వ్యాఖ్యానించారు. అత్యల్ప మెజారిటీతో బీజేపీ ఓడిపోయిన నియోజకవర్గాలను గుర్తించి, అక్కడ ప్రతిపక్షాలకు అనుకూలంగా ఉన్న ఓట్లను తగ్గించడం ద్వారా ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే వ్యూహం గతంలో బీహార్, బెంగాల్,అస్సాం రాష్ట్రాలలో అమలు చేసి వాళ్ళు గెలిచారని ప్రస్తుతం తెలంగాణలో కూడా అమలు చేసే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.

**డీలిమిటేషన్ రాజకీయ ఎత్తుగడ**

నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) ప్రక్రియను కూడా ఎన్నికల లబ్ధికి అనుకూలంగా వినియోగించే ప్రయత్నం జరుగుతోందని రాఘవులు ఆరోపించారు. బీజేపీకి అనుకూల ప్రాంతాలను ఒకే నియోజకవర్గంగా మార్చడం, ప్రతిపక్షాలకు బలం ఉన్న ప్రాంతాలను విభజించడం ద్వారా ఎన్నికల సమీకరణాలను మార్చే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. దక్షిణాది రాష్ట్రాలకు డీలిమిటేషన్ వల్ల ప్రాతినిధ్యం తగ్గే ప్రమాదం ఉందని, దీనిపై అన్ని రాజకీయ పార్టీలు కలిసి పోరాడాల్సిన అవసరం ఉందన్నారు.

గత రాష్ట్రాల అనుభవాలను గుర్తుచేసిన రాఘవులుబీహార్, అస్సాం, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాల్లో గతంలో నిర్వహించిన ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణలను ఉదహరిస్తూ, అర్హులైన అనేక మంది ఓటర్ల పేర్లు తొలగించబడ్డాయని ఒక్క బెంగాల్ లో కోటి ఓట్లు తొలగించారని అక్కడ ప్రజలు ఆందోళన చేస్తే న్యాయస్థానాలు జోక్యం చేసుకుంటే డెభై లక్షల మంది ఓట్లు తిరిగి చేర్చారని ముఫై లక్షల మంది ఓట్లు పోవడం జరిగిందని రాఘవులు ఆరోపించారు. ఆధార్, రేషన్ కార్డు, పాస్‌పోర్ట్ వంటి పత్రాలను కూడా అంగీకరించకుండా ఇబ్బందులు కల్పించడం, చిన్నపాటి వివరాల వ్యత్యాసాల పేరుతో ఓటర్లను తొలగించడం వంటి ఘటనలు చోటు చేసుకున్నాయని పేర్కొన్నారు.

**ప్రజాస్వామ్య పరిరక్షణకు అప్రమత్తత అవసరం**

ఓటు హక్కు ఏ ఒక్క పార్టీకి సంబంధించిన అంశం కాదని, ప్రజాస్వామ్యానికి మూల స్తంభమని రాఘవులు అన్నారు. ప్రతి ఓటరు తన పేరు ఓటర్ల జాబితాలో ఉందో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని, ఎక్కడైనా తొలగింపు లేదా లోపాలు కనిపిస్తే వెంటనే అభ్యంతరాలు తెలియజేయాలని సూచించారు. ఎస్ఐఆర్‌ను సాధారణ పరిపాలనా ప్రక్రియగా కాకుండా ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ అంశంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని, సీపీఎం కార్యకర్తలు గ్రామస్థాయిలో చురుగ్గా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. సర్ పై అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం ఏర్పాటు చేయాలనీ సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి జహంగీర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జహంగీర్ మాట్లాడుతూ.. జిల్లాలో బీఎల్ఓ, బీఎల్ఏ లుగా విధులు నిర్వహిస్తున్న వారికి సరైన శిక్షణను ఇవ్వలేదని, జిల్లా కలెక్టర్ ఈ అంశాన్ని పరిశీలించి అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం ఏర్పాటు చేయాలని, వలస కార్మికులు గ్రామాలలో లేరని, నేటికి అనేక వేల మంది దరఖాస్తు పారాలను పూర్తి చేసి ఇవ్వలేదని తెలియజేశారు. ఈ సెమినార్ కి సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.డి పాష అధ్యక్షత వహించగా ఈ సెమినార్ లో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ళ ఆశయ్య , కొండమడుగు నర్సింహా, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాటూరి బాలరాజ్ గౌడ్, కల్లూరి మల్లేశం, బూరుగు కృష్ణారెడ్డి, జల్లెల పెంటయ్య, గుంటోజు శ్రీనివాసచారి, మండల కార్యదర్శి గంగాదేవి సైదులు, జిల్లా కమిటీ సభ్యులు రాయగిరి కిష్టయ్య, సిరిపంగి స్వామి, అవ్వారు రామేశ్వరి, బొడ్డుపల్లి వెంకటేష్, మద్దెల రాజయ్య, దూడ యాదిరెడ్డి, కోట రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ కోసం పనిచేస్తే పదవులకు కొదవుండదు


**తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా రమావత్ సక్రు నాయక్**



**మన తొలివెలుగు, తెలంగాణ బ్యూరో :** తెలంగాణ గిరిజన సమాఖ్య 3వ రాష్ట్ర మహాసభలు కొత్తగూడెం జిల్లా పారిశ్రామిక పట్టణం పాల్వంచలో ఈ నెల 18, 19 తేదీల్లో జరిగాయి. ఈ మహసభలకు రాష్ట్ర వ్యాప్తంగా 300మంది ప్రతినిధులు హజరయ్యారు. ఈ మహాసభకు రంగారెడ్డి జిల్లా 5గురు ప్రతినిధులు హాజరయ్యారు. అందులో హయత్ నగర్ కు చెందిన రమావత్ సక్రు నాయక్ తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తన ఎన్నికకు సహకరించినటువంటి రాష్ట్ర మహాసభ ప్రతినిధులకు, రాష్ట్ర అధ్యక్షు కార్యదర్శులు రామ్మూర్తి, అంజయ్య నాయక్ కి, సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్యకి, రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలుకి, రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు బాతరాజు నర్సింహా కి రమావత్ సక్రు నాయక్ విప్లవ అభివందనాలు తెలియజేశారు. తనపై నమ్మకం ఉంచి గిరిజన సమాఖ్య రాష్ట్ర బాధ్యతలు అప్పజెప్పినందుకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి గిరిజనుల సమస్యలపై పోరాటాల నిర్వహిస్తానని తెలిపారు.

## గులాబీ కంచుకోటపై కాంగ్రెస్ కన్ను

**కరీంనగర్ :** తెలంగాణ రాజకీయ క్షేత్రంలో ఇప్పుడు సరికొత్త, అత్యంత వ్యూహాత్మకమైన అంతర్గత పోరాటం సాగుతోంది. నిన్నటివరకు తిరుగులేని రాజకీయ శక్తులుగా, అజేయమైన కోటలుగా వెలిగిన బీఆర్ఎస్ టాప్ లీడర్ల సొంత నియోజకవర్గాలపై అధికార కాంగ్రెస్ పార్టీ ప్రత్యేకంగా కన్నేసింది. గులాబీ దళపతి కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అడ్డా సిరిసిల్ల, ట్రబుల్ షూటర్ హరీష్ రావు కంచుకోట సిద్దిపేట నియోజకవర్గాల్లో పొలిటికల్ హీట్ అమాంతం పెరిగింది. ప్రధాన నేతలను నేరుగా ఢీకొట్టడం కంటే, వారి రాజకీయ పునాదులను కదిలించేలా ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని టార్గెట్ చేస్తూ కాంగ్రెస్ వేస్తున్న అడుగులు క్షేత్రస్థాయి రాజకీయాలను వేడెక్కిస్తున్నాయి.నిన్నటివరకు బీఆర్ఎస్ పార్టీకి వెన్నుముకగా నిలిచిన స్థానిక సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, మండల పార్టీ అధ్యక్షులను కాంగ్రెస్ స్థానిక నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు వ్యూహాత్మకంగా ఆకర్షిస్తున్నారు. ముఖ్యంగా గజ్వేల్ ? సిద్దిపేట సరిహద్దు ప్రాంతాల్లో ఈ సైలెంట్ ఆపరేషన్ అత్యంత వేగంగా విస్తరిస్తోంది. టాప్ లీడర్లు హైదరాబాద్‌లోనే ఉంటూ అసెంబ్లీ లేదా మీడియా వేదికలపై కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాడుతుంటే, క్షేత్రస్థాయిలో మాత్రం హస్తం శ్రేణులు గ్రామాల్లోని కరడుగట్టిన బీఆర్ఎస్ కార్యకర్తలను టార్గెట్ చేస్తున్నారు. గజ్వేల్ లాంటి ప్రాంతాల్లో క్యాంప్ ఆఫీసుల చుట్టూ జరుగుతున్న రాజకీయ ఘర్షణలు, నిరసనలు కేవలం పైకి కనిపిస్తున్న ఊహాగానాలు కావు, లోపల మాత్రం కాంగ్రెస్ తన పనిని నిశ్శబ్దంగా పూర్తి చేస్తోంది. పదేళ్ల కాలంలో గ్రామాల్లో పనులు చేసి బిల్లులు రాక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న మాజీ సర్పంచులు, నిధుల కొరతతో సతమతమవుతున్న ప్రజాప్రతినిధుల బలహీనతలను కాంగ్రెస్ పార్టీ క్యాష్ చేసుకుంటోంది. వారికి అధికార పార్టీ అండగా ఉంటుందనే భరోసా ఇస్తూనే, మూడు రకాల ఆకర్షణీయమైన వ్యూహాలను అమలు చేస్తోంది. త్వరలో రాబోయే నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పిస్తామని లేదంటే స్థానిక నిధుల కేటాయింపుల్లో ప్రాధాన్యత ఇస్తామని హామీలు ఇస్తోంది. దారికి రాకపోతే అధికార బలంతో స్థానిక పనులకు బ్రేకులు వేయడం లేదా సహకరించడం ద్వారా ఒత్తిడి పెంచుతోంది. బీఆర్ఎస్ అధిష్టానానికి, స్థానిక లీడర్లకు మధ్య గ్యాప్ పెంచేందుకు ప్రయత్నిస్తోంది. మీరు ప్రతిపక్ష పార్టీలో ఉంటే మీకు లాభం ఉండదని, అధికార పార్టీలోకి వస్తే గ్రామాల అభివృద్ధి సాధ్యమనే ప్రచారాన్ని క్యాడర్‌లోకి బలంగా తీసుకెళ్తున్నారు. దీనివల్ల నియోజకవర్గ కేంద్రాల్లో బీఆర్ఎస్ ఇంకా బలంగానే కనిపిస్తున్నా, లోపలి గ్రామాల్లో మాత్రం గులాబీ కోటల పునాదులు నెమ్మదిగా బలహీనపడుతున్నాయి.అయితే, ఈ ఆపరేషన్ కాంగ్రెస్‌కు అంత సులభంగా ఏకపక్షంగా సాగడం లేదు. సిద్దిపేట, గజ్వేల్ పరిసర ప్రాంతాల్లో హరీష్ రావు లాంటి సీనియర్ నేతలు రంగంలోకి దిగి డ్యామేజ్ కంట్రోల్ చర్యలు చేపట్టారు. అలకపాన్పు ఎక్కిన కార్యకర్తలను బుజ్జగించేందుకు, పార్టీ మారిన వారిని తిరిగి సొంత గూటికి చేర్చుకునేందుకు గట్టిగానే ప్రయత్నిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల వైఫల్యాలను, స్థానిక సంస్థల ఎన్నికల జాప్యాన్ని ఎండగడుతూ రివర్స్ అటాక్ చేస్తున్నారు. అయినప్పటికీ, అధికార పార్టీ విసిరిన వ్యూహాత్మక వలయం వల్ల ద్వితీయ శ్రేణి నాయకత్వంలో కొంత అయోమయం స్పష్టంగా కనిపిస్తోంది. కంచుకోటలుగా భావించే ఈ మూడు నియోజకవర్గాల్లో క్యాడర్ గనుక చెల్లాచెదురైతే, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అది బీఆర్ఎస్ ఉనికికే ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది.గులాబీ నేతలకు హస్తం పార్టీ వేస్తున్న ఈ గాలం కేవలం తాత్కాలిక రాజకీయ ప్రయోజనాల కోసం లేదా కేవలం స్థానిక లీడర్లను మార్చడం కోసం మాత్రమే కాదు. దీని వెనుక పెద్ద స్కెచ్ ఉంది. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులను రాష్ట్రస్థాయి రాజకీయాలపై దృష్టి పెట్టకుండా, వారి వారి సొంత నియోజకవర్గాల రక్షణలోనే నిరంతరం బిజీగా ఉంచాలనేది కాంగ్రెస్ మార్క్ హైలెవల్ పొలిటికల్ స్ట్రాటజీ. తద్వారా రాష్ట్రస్థాయిలో ప్రభుత్వంపై వారి దూకుడును తగ్గించవచ్చని కాంగ్రెస్ భావిస్తోంది. ఈ మైండ్ గేమ్‌లో అధికార కాంగ్రెస్ ఎంతవరకు సఫలమవుతుంది, గులాబీ త్రయం తమ కంచుకోటలను ఎలా కాపాడుకుంటుంది అనేది రాబోయే రోజుల్లో తేలనుంది.




## ప్రభాస్ ఫౌజీ.. రెబల్ స్టార్ పవర్‌ఫుల్ రోల్..!

రెబల్ స్టార్ ప్రభాస్ నటిస్తోన్న పాన్ ఇండియా చిత్రం ఫౌజీ. ఈ మూవీకి హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ మూవీకి సంబంధించిన క్రేజీ అప్‌డేట్ వచ్చేసింది. ఇందులో ప్రభాస్ ఆజాద్ హింద్ ఫౌజ్ సైనికుడిగా కనిపించనున్నారని తెలుస్తోంది. నేతాజీ సుభాశ్ చంద్రబోస్ నాయకత్వంలో భారత స్వాతంత్ర్యం కోసం ఆయన చేసే పోరాటమే ప్రధానంగా తెరకెక్కించనున్నట్లు సమాచారం. ఈ చిత్రంలో ప్రభాస్ ముందుగా బ్రిటీష్ ఇండియన్ ఆర్మీలో సైనికుడిగా పనిచేసి.. ఆ తర్వాత సుభాశ్ చంద్రబోస్ నేతృత్వంలోని ఆజాద్ హింద్ ఫౌజ్‌లో చేరుతాడని తెలుస్తోంది. ఇది కేవలం నేతాజీ బయోపిక్ మాత్రమే కాదని.. అంతే కాకుండా ఇండియన్ ఫ్రీడమ్ కోసం పోరాడిన సైనికుల కథను చూపించే చిత్రంగా ఉండనుందని టాక్. ఈ మూవీలో ప్రభాస్ పాత్ర ధైర్య సాహసాలు, త్యాగం, దేశభక్తితో నిండి ఉంటుందని సమాచారం. అయితే దీనిపై ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటనైతే రాలేదు. ఈ చిత్రాన్ని డిసెంబరు 3న ఫౌజీ విడుదల కానుందని తాజాగా పోస్టర్‌ను పంచుకుంది. ఈ పోస్టర్‌లో ఎప్పుడు చూడని లుక్‌లో ప్రభాస్ కనిపించారు. దీంతో అభిమానుల్లో అంచనాలు పెంచేసింది. ఈ చిత్రంలో ప్రభాస్ సరసన ఇమాన్వి హీరోయిన్‌గా కనిపించనుంది. ఈ చిత్రంలో మిథున్ చక్రవర్తి, అనుపమ్ ఖేర్, జయప్రద కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ భారీ యాక్షన్ మూవీ డిసెంబర్ 3న థియేటర్లలో సందడి చేయనుంది. కాగా.. ప్రభాస్ ఫౌజీతో పాటు సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో నటిస్తున్నారు. వీరిద్దరి కాంబోలో స్పిరిట్ చిత్రంలో కనిపించనున్నారు. ఈ మూవీలో త్రిప్తి దిమ్రీ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఆ తర్వాత సలార్: పార్ట్ 2, కల్కి 2898 ఏడీ: పార్ట్ 2 సినిమాలు చేస్తున్నారు.

# 10 రోజుల్లో అక్కినేని అఖిల్ 'లెనిన్' రికార్డు వసూళ్లు

టాలీవుడ్ యాక్టర్ అక్కినేని అఖిల్ టైటిల్ రోల్‌లో నటించిన చిత్రం 'లెనిన్'. మురళీ కిషోర్ అబ్బూరి దర్శకత్వం వహించిన ఈ మూవీలో మిస్టర్ బచ్చన్ ఫేం భాగ్య శ్రీ బోర్సే హీరోయిన్‌గా నటించింది. జులై 10న గ్రాండ్‌గా విడుదలైన ఈ చిత్రం నిర్మాతలకు కాసుల వర్షం కురిపిస్తూ అఖిల్ కెరీర్‌లో బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచింది. లెనిన్ 10 రోజుల సక్సెస్‌ఫుల్ థియాట్రికల్ రన్‌లో వరల్డ్ వైడ్‌గా రూ.88 కోట్లు సాధించింది. ఈ విషయాన్ని మేకర్స్ అఫీషియల్‌గా అనౌన్స్ చేశారు.

ఈ అరుదైన సందర్భాన్ని పురస్కరించుకుని ఇవాళ సాయంత్రం లెనిన్ టీం హైదరాబాద్‌లో సక్సెస్ మీట్ ఏర్పాటు చేయనుంది. ఈవెంట్‌కు అక్కినేని నాగచైతన్య చీఫ్ గెస్ట్‌గా రాబోతున్నాడు. ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చిన తర్వాత ఈ మూవీని అన్నపూర్ణ స్టూడియోస్‌తోపాటు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లపై అక్కినేని నాగార్జున, నాగ వంశీ సంయుక్తంగా నిర్మించారు. రొమాంటిక్ యాక్షన్ డ్రామాగా వచ్చిన ఈ చిత్రంలో శివాజీ, సునీల్ కీ రోల్స్‌లో నటించారు. ఈశ్వరీరావ్, బ్రహ్మాజీ, ప్రమోద్ పంజు కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి ఎస్ థమన్ మ్యూజిక్ అందించాడు. లెనిన్ థియాట్రికల్ రన్ తర్వాత జీ5 ఓటీటీ ప్లాట్‌ఫాంలో ప్రీమియర్ కానుంది. అంతేకాదు జీ తెలుగు, జీ సినిమాలులో టెలివిజన్ ప్రీమియర్ కానుంది






## అర్థం చేసుకోకుండా కామెంట్స్ చేస్తారు..

### నెట్టింట నెగెటివిటీపై రకుల్ ప్రీత్ సింగ్

తెలుగు, తమిళం, హిందీ ప్రేక్షకులకు పెద్దగా ఇంట్రడక్షన్ అవసరం లేని యాక్టర్ రకుల్ ప్రీత్ సింగ్. పక్కా ప్రొఫెషనల్‌గా ఉండే ఈ భామ అప్పడప్పుడు నెటిజన్లు, అభిమానులతో తన అభిప్రాయాలను షేర్ చేసుకుంటుంది. తాజాగా సోషల్ మీడియాలో పెరుగుతున్న నెగెటివిటీ గురించి మాట్లాడింది. సోషల్ మీడియా అనేది కొందరు జనాలు ముక్కుమొఖం తెలియని అకౌంట్లతో తరచూ కఠిన వ్యాఖ్యలు చేస్తూ నెగెటివిటీని ప్రచారం చేసే హబ్‌లాంటిది. చాలా మంది వ్యక్తులు అజ్ఞాత ప్రొఫైల్స్‌తో స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తుంటారు. వారు చేస్తున్నకామెంట్ల ప్రభావం ఎలా ఉంటుందో కనీసం అర్థం చేసుకోరని చెప్పింది. అందరినీ మెప్పించడం అసాధ్యమన్న రకుల్ ప్రీత్ సింగ్ సెలబ్రిటీలు ఆన్‌లైన్‌లో వచ్చే అనవసరమైన ట్రోల్స్, విమర్శల వల్ల తమ ఫోకస్ మార్చుకోకూడదు. నెగెటివిటీని ఎదుర్కొనేందుకు వాటిని పట్టించుకోకుండా వ్యక్తిగత, వృత్తి పరమైన లక్ష్యాలపైన దృష్టి పెట్టడమే ఉత్తమ మార్గమనని చెప్పుకొచ్చింది. ఇండియన్ 2 సినిమాతో తెలుగు ప్రేక్షకుల ముందుకొచ్చిన రకుల్ ప్రీత్ సింగ్.. స్ట్రెయిట్ తెలుగు సినిమా చేయక చాలా కాలమే అవుతుంది. ప్రస్తుతం రణ్ బీర్ కపూర్ నటిస్తోన్న రామాయణలో కీలక పాత్రలో నటిస్తోంది. రకుల్ నటించిన [illegible] ప్రస్తుతం ఓటీటీ ప్లాట్‌ఫాం నెట్‌ఫ్లిక్స్‌లో ట్రెండింగ్ అవుతోంది. ఈ భామ నెక్ట్స్ ఇండియన్ 3 చేయాల్సి ఉంది. మరి తెలుగు సినిమాలో ఎప్పుడు కనిపిస్తుందో చూడాలి.

## అల్లు అర్జున్ 'రాకా' టీంలోకి మరో భామ.. ఇంతకీ పాత్ర ఏంటో మరి..?

టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబోలో 'రాకా' సినిమా వస్తుందని తెలిసిందే. సైన్స్ ఫిక్షన్, యాక్షన్ ఎలిమెంట్స్‌తో వస్తోన్న ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ ప్రాజెక్టులో ఇప్పటికే మలయాళ నటి ఫెమినా జార్జ్, పంజాబీ నటి నైలా గ్రేవల్ భాగమైనట్టు క్రేజీ అప్‌డేట్స్ వచ్చాయని తెలిసిందే. తాజాగా మరో ఆసక్తికర నెట్టింట వైరల్ అవుతోంది. తెలుగు నటి సిరి హన్మంతు 'రాకా' చిత్రంలో జాయిన్ అయింది. రీసెంట్‌గా జరిగిన ఓ ఈవెంట్‌లో నిర్మాత ఎస్‌కేఎన్ ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించారు. సిరి హన్మంతు చివరగా సీతాపయనంలో మెరవగా.. త్వరలో విడుదల కానున్న ' చెన్నై లవ్ స్టోరీ' లో కూడా సందడి చేయనుంది. ఈ నేపథ్యంలో ఇంతకీ సిరి హన్మంతు రాకా మూవీలో ఎలాంటి పాత్రలో కనిపించబోతున్నది ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం ముంబైలో షూటింగ్ కొనసాగుతోంది. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా వస్తోన్న ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ తెరకెక్కిస్తోంది. ఈ మూవీని 2027 చివరలో విడుదల చేయనున్నారు. ఈ చిత్రానికి సాయి అభ్యాంకర్ మ్యూజిక్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నాడు.



## 'కొరియన్ కనకరాజు' కొత్త సాంగ్ రిలీజ్

మెగాహీరోల్లో వరుణ్ తేజ్ ఒకడు. ముకుంద, ఫిదా, తొలిప్రేమ, కంచె లాంటి సినిమాలతో కెరీర్ ప్రారంభంలో సమ్‌థింగ్ డిఫరెంట్ అనిపించుకున్నాడు. తర్వాత నుంచి వరసపెట్టి ఫ్లాప్స్ పడ్డాయి. 2019లో వచ్చిన 'గద్దలకొండ గణేశ్' ఓ మాదిరిగా ఆకట్టుకోగా.. తర్వాత వచ్చిన గని, గాండీవదారి అర్జున, ఆపరేషన్ వాలంటైన్, మాట్కా చిత్రాలు ఒకదానిని మించి మరొకటి డిజాస్టర్స్ అయ్యాయి. దీంతో రెండేళ్లు గ్యాప్ తర్వాత వరుణ్ తేజ్ నుంచి వస్తున్న సినిమా 'కోరియన్ కనకరాజు'. వచ్చే నెల 7న థియేటర్లలో రిలీజ్ కానుంది. వారం క్రితం టీజర్ రిలీజ్ చేయగా పర్లేదనిపించుకుంది. ఈ క్రమంలోనే ఇప్పుడు 'రసగుమ్మడి' అంటూ ఓ పాట వదిలారు. విలేజ్ స్టైల్లో సాగే మాస్ బీట్‌తో ఉన్న ఈ గీతం కలర్‌ఫుల్‌గా బాగుంది. తమన్ మ్యూజిక్ వినసొంపుగా ఉంది. ఇకపోతే ఈ చిత్రానికి మేర్లపాక గాంధీ దర్శకుడు. రితికా నాయక్ హీరోయిన్.



PRINTED AND PUBLISHED BY KANUGULA SRINIVAS ON BEHALF OF VIPLAV MEDIA PUBLICATIONS. AT M/S SMIL YS ONLINE H.NO : 6-7-48 VANASTHALIPURAM SHOPPING COMPLEX, RANGAREDDY DIST, TELANGANA - 500 O70 AND PUBLISHED AT VIPLAV MEDIA PUBLICATIONS. H.NO : 18-7-496 KANDIKAL GATE, UPPUGUDA, HYDERABAD, TELANGANA - 500 053. CEO & CHIEF EDITOR VANGA NAGARAJ REDDY (RAJU), EDITOR VANGA VIPLAV TEJA. PRGI : TGBIL/26/A2289. PHONE NO: +9184990 94183, +9193945 17067